ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 24 మే 2024


దారుణంగా ఉన్న గాంధీనగర్ రోడ్డు


నెల్లూరులోని అపోలో ఆసుపత్రికి వెళ్లే రహదారి దుస్థితి


గుంతలమయంగా నగరంలోని పొదలకూరు రహదారి

టెండర్లతోనే సరి..

పనులు చేయరు మరి !

- జిల్లాలో ఎక్కడ చూసినా గుంతల రోడ్లే...!
- మూడేళ్లుగా అవస్థలు పడుతున్న ప్రజలు
- కనీసం ప్యాచ్ వర్కులు కూడా చేయని ప్రభుత్వం
- బిల్లులివ్వకపోవడంతో ముందుకు రాని కాంట్రాక్టర్లు

నెల్లూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రజాజీవనంలోనూ, అభివృద్ధి క్రమంలోనూ రోడ్లు ఎంతో కీలకం. రహదారులు ఎంత బాగుంటాయో, ఆ ప్రాంతం అంత అభివృద్ధి చెందిందని అర్థం. కానీ జిల్లాలోని రోడ్లను చూస్తే ఎంత దారుణంగా ఉన్నాయో తెలుస్తుంది. ఇక ఆరోడ్లపై నిత్యం ప్రయాణమంటే నరకం కళ్ల ముందు కనిపిస్తుంది. జిల్లా కేంద్రం మొదలు చిన్న గ్రామం వరకు రహదారులను పరిశీలిస్తే ఏమున్నది గర్వకారణం అనిపిస్తుంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి రెండేళ్లు కొంత బాగున్న రోడ్లు... ఆ తర్వాత వరదలు, భారీ వర్షాలకు దారుణంగా దెబ్బతిన్నాయి. కానీ అప్పటి నుంచి వీటిని పట్టించుకున్న వారు లేరు. రోడ్డు మొత్తాన్ని బాగు చేయడం అటుంచితే కనీసం గుంతలు పూడ్చే పనులు కూడా చేపట్టలేదు. గత ప్రభుత్వంలో టెండర్లు పిలిచిన ఏఐఐబీ పనులు కూడా ఇంకా పూర్తి కాలేదంటేనే ప్రభుత్వ పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక మూడేళ్ల క్రితం పిలిచిన ఎన్డీబీ వర్కులయితే డబ్బుల్లేక ఆగిపోయాయి. ఆఖరుకు నెల్లూరులో కీలకమైన పొదలకూరు రోడ్డును కూడా అభివృద్ధి చేయలేకపోయారు.

ప్యాచ్ వర్కులు కూడా చేయలేదు..

ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్ల మొత్తాన్ని అభివృద్ధి చేయాల్సి ఉంది. కానీ ప్రభుత్వం వద్ద నిధుల్లేవు. ఒకవేళ ప్రభుత్వం టెండర్లు పిలిచినా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడంలేదు. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. దీంతో జిల్లాలోని ఆర్అండ్బీ రోడ్లకు కనీసం ప్యాచ్లయినా వేయాలని ఎన్నికలకు ముందు రూ.10 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. నెల్లూరు, కావలి డివిజన్లకు రూ.5 కోట్లు, గూడూరు డివిజన్కు మరో రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో జనవరిలో ఆర్అండ్బీ అధికారులు సుమారు వంద ప్యాచ్ వర్కులకు టెండర్లు పిలిచారు. ఒక్కో వర్కు విలువ సరాసరి రూ.10 లక్షలుగా ఉంది. అయితే ఏ ఒక్క పనికీ కాంట్రాక్టర్లు టెండర్లు వేయలేదు. దీంతో ఫిబ్రవరిలో రెండోసారి టెండర్లు పిలిచారు. ఎన్నికల సమయంలో ఇబ్బందులు వస్తాయని భావించిన వైసీపీ నాయకులు, కొందరు కాంట్రాక్టర్లపై ఒత్తిళ్లు తేవడంతో కొన్ని పనులకు మాత్రమే టెండర్లు దాఖలయ్యాయి. కానీ వారిలో కొంతమంది అగ్రిమెంటు చేసుకున్నారు. ఇంకొంత మంది చేసుకోవాల్సి ఉంది. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో ఒక్క ప్యాచ్ వర్కు కూడా పూర్తి చేయలేదు.

అత్యవసర పనులకూ దిక్కులేదు...

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగినప్పుడు ఐప్యాక్ టీం సర్వే చేసింది. ఆ సర్వే ప్రకారం రోడ్లు గుంతలమయంగా ఉండడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని గుర్తించారు. దీంతో జిల్లాలో కనీసం 23 ప్రధాన కనెక్టివిటీ రోడ్లను అత్యవసరంగా బాగు చేయాలని ఐప్యాక్ టీం ప్రభుత్వానికి సూచించింది. ఈ క్రమంలో ఆ రోడ్లను బాగు చేసేందుకు రూ.87 కోట్లకు గతేడాది జూలైలో అనుమతులు మంజూరు చేశారు. అయితే అప్పటికే భారీగా బిల్లులు పెండింగ్ ఉండడం, ప్రభుత్వ తీరుతో విసిగి వేసారిన కాంట్రాక్టర్లు ఆ వర్కులకు టెండర్లు వేయకూడదని అసోసియేషన్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో ప్రభుత్వ పెద్దలు కాంట్రాక్టర్లతో సమావేశమై పెండింగ్ బిల్లులను విడతల వారీగా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఐప్యాక్ వర్కులకు టెండర్లు వేయాలని కోరారు. దీన్ని నమ్మిన కాంట్రాక్టర్లు జిల్లాలో ఆ 23 వర్కులకు టెండర్లు వేశారు. కానీ ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వమేమో పెండింగ్ బిల్లులు చెల్లించలేదు. దీంతో అగ్రిమెంట్లు చేసుకోకుండా ఆగిపోయారు. అయితే ఈ దఫా నిబంధనలను తెరమీదకు తెచ్చి అగ్రిమెంట్లు చేసుకోకపోతే బ్లాక్ లిస్టులో పెడతామని కాంట్రాక్టర్లను బెదిరించారు. దీంతో విధిలేక కాంట్రాక్టర్లు అగ్రిమెంట్ చేసుకున్నారు. కానీ పనులు మాత్రం మొదలు పెట్టలేదు. ఇటీవల రెండు, మూడు రోడ్ల పనులు మాత్రం మొదలుపెట్టారు. ఈ ప్రభావం ప్రజలపై తీవ్రంగా పడుతోంది. రోడ్డు మొత్తాన్ని బాగు చేయడం అటుంచితే కనీసం భారీ గుంతలను పూడ్చాలని వేడుకుంటున్న ప్రజలకు మరికొన్ని రోజులు ఆ కష్టం కూడా తీరేలా కనిపించడం లేదు.

గుంతలమయంగా గ్రామీణ రోడ్లు

రెండేళ్లక్రితం పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ రోడ్లను రూ.1100 కోట్ల అగ్రికల్చరల్ మార్కెటింగ్ నిధులు(ఏఎంసీ)తో అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించింది. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో 195 రోడ్ల అభివృద్ధికి రూ.155.60 కోట్లతో టెండర్లు పిలిచారు. 591 కిలోమీటర్లను 34 ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలవగా, కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. మూడు సార్లు టెండర్లు పిలవగా కేవలం ఎనిమిది ప్యాకేజీలకు మాత్రమే టెండర్లు దాఖలయ్యాయి. అప్పటికే భారీగా బిల్లులు పెండింగ్ ఉండడం, పనులు చేస్తే బిల్లులు ఇస్తారో లేదోనన్న భయం ఉండడంతో రోడ్ల వర్కులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపలేదు. అప్పుడు కూడా రాష్ట్ర అధికారులు, ప్రజాప్రతినిధులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చినా వారు టెండర్లు వేయలేదు. దీంతో పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధి అనేది ప్రచార ఆర్భాటానికే పరిమితమైంది. ఎన్నికలు సమీపిస్తుండడంతో తాజాగా మరోసారి ఈ వర్కులకు టెండర్లు పిలిచారు. గతేడాది ఎవరూ టెండర్లు వేయకపోవడంతో కొత్త ఎస్ఎస్ఆర్ ప్రకారం అంచనా విలువ పెరిగింది. ఇలా కూడా ప్రభుత్వ ఖజానాపై భారం పడింది. అయినా ఈ రోడ్లను అభివృద్ధి చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. గ్రామాల్లో ప్రధాన లింకు రోడ్లుగా ఈ రోడ్లు గుంతలతో దారుణంగా ఉన్నాయి. నిత్యం ఈ రోడ్లపై ప్రభుత్వాన్ని తిట్టుకుంటూ ప్రజలు ప్రయాణిస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



- కనులపండువగా కల్యాణోత్సవం
- స్వామివారి కల్యాణంతోపాటు సామూహిక వివాహాలు
- గజవాహనంపై క్షేత్రోత్సవం

వైభవంగా

శ్రీహరి రథోత్సవం

రాపూరు(డక్కిలి), మే 23 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో గురువారం ఉదయం చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి సమేత పెంచలస్వామి కల్యాణం కనులపండువగా జరిగింది. ముందుగా కల్యాణ మండపాన్ని శోభాయమానంగా అలంకరించి, వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నమధ్య స్వామి వారి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అధికారులు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. స్వామి కల్యాణంతోపాటు పలు జంటలు సాముహిక వివాహాలు చేసుకొని ఒక్కటయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని తిలకించారు.కాగా వివిధ మండపాల్లో జరిగే విశేష పూజాకార్యక్రమాలను భారీ స్క్రీన్ల ద్వారా భక్తులు వీక్షించే అవకాశం కల్పించారు. కల్యాణం అనంతరం ఆలయ అర్చకులు చేపట్టిన ఎదుర్కోలు ఉత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఏసీ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, డీసీ కే విజయసాగర్ సాగరబాబు, ఆలయ ఇన్స్పెక్టర్ హరీష్, ప్రధాన అర్చకులు రామయ్యస్వామి, శశికుమార్ స్వామి, గుండ్లూరు సీతారామయ్య, పెంచలయ్య, బాలాజీ, మధు స్వామి పాల్గొన్నారు.

● వైభవంగా రథోత్సవం

గురువారం రాత్రి ఉభయ దేవేరులతో కలిసి పెంచలస్వామి తిరుత్తేరుపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉత్సవమూర్తులను కొలువు దీర్చి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీవారి ఆలయం నుంచి కోన ముఖద్వారం వరకు భక్తులు రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గజవాహనంపై క్షేత్రోత్సవం నిర్వహించారు.

● నేడు తెప్పోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8.30 గంటలకు వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి 7 గంటలకు తెప్పోత్సవం, 10 గంటలకు అశ్వవాహనసేవ, రాత్రి 11.30 గంటలకు ధ్వాజావరోహణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ డీసీ సాగర్బాబు తెలిపారు.

● కోనంతా జనమే జనం

శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా కోనంతా జనసంద్రంగా మారింది. కొనుగోలు దారులతో దుకాణాలన్నీ కిటకిటలాడాయి. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రాపూరు ఎస్ఐ మాలాద్రి తెలిపారు.


నరసింహాపురం వీధుల్లో సాగుతున్న వేదగిరీశుడి రథోత్సవం, (ఇన్సర్ట్లో) రథంపై కొలువుతీరిన స్వామి, అమ్మవార్లు

తేరుపై వేదగిరీశుడి విహారం

నెల్లూరురూరల్: వేదగిరిపై వెలసిన లక్ష్మీ నరసింహస్వామి గురువారం ఉభయ దేవేరులతో కలిసి మెట్ల మార్గాన నరసింహ పురానికి చేరుకుని రథంపై ఊరేగారు. విశేషంగా తరలి వచ్చిన భక్తులు గోవిందా... గోవిందా... అంటూ రథాన్ని ముందుకు లాగారు. బిందెలతో నీళ్ల నేలపై పోస్తూ కర్పూర హారతులతో జనం రథోత్సవానికి స్వాగతం పలికారు. నరసింహపుర వీధుల్లో 1.30 గంటల పాటు రథోత్సవం సాగింది.

● వేడుకగా కూర్మ జయంతి

కూర్మ జయంతిని పురష్కరించుకుని గురువారం కూర్మ అవ తారంలోని స్వామివారి విగ్రహం వద్ద అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో స్వామి, అమ్మ వార్లను మెట్ల మార్గంలో తిరిగి ఆలయంలోకి తో డ్కొని వెళ్లారు. కాగా వేదగిరి బ్రహ్మోత్సవాల్లో దాతలు పోటీ పడి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను జిల్లా దేవదా యశాఖ అధికారి శ్రీనివా సురావు, ఆలయ ఈవో గిరికృష్ణ పర్యవేక్షించారు.


కోనలో పెంచలోరి కల్యాణం

ఓట్ల లెక్కింపు

ప్రశాంతంగా జరిగేలా...!

- గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్మార్చ్
- జిల్లావ్యాప్తంగా కార్డెన్ సెర్చ్
- సమస్యాత్మక గ్రామాల్లో ఎస్పీ ముఖాముఖి

నెల్లూరు(క్రైం), మే 23: సార్వత్రిక ఎన్నికల పోలింగ్కు ముందు పోలీసుశాఖ నిరంతరం నిఘా ఉంచడం సర్వసాధారణం. అయితే ఈసారి పోలింగ్ ముగిశాక కూడా పోలీసులు, కేంద్రసాయుధ బలగాలు గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో ఫ్లాగ్మార్చ్లు, కార్డన్ సెర్చ్లు నిర్వహిస్తున్నారు. పోలింగ్ తరువాత రాష్ట్రంలో జరిగిన హింసాకాండ దృష్ట్యా ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగేలా చూసేందుకు వారు ఈ చర్యలు చేపట్టారు. అంతేకాక సమస్యాత్మక, సున్నితమైన గ్రామాల్లో జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ పర్యటిస్తూ గ్రామస్థులతో ముఖాముఖి నిర్వహిస్తున్నారు. అల్లర్లు, వివాదాలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. జూన్4న ఓట్ల లెక్కింపును ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసుకుంది. అందులో భాగంగా కృష్ణాపట్నం నుంచి ఉలవపాడు వరకు ఉన్న మత్స్యకారులతో జిల్లా ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ ముఖాముఖి నిర్వహిస్తున్నారు. గ్రామకాపులు, పెద్దలు, గ్రామస్థులతో సమావేశం నిర్వహించి ఓట్ల లెక్కింపునకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అల్లర్లకు, గొడవల జోలికి వెళితే సహించేది లేదని హెచ్చరిస్తున్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఫ్లాగ్మార్చ్లు నిర్వహిస్తున్నారు.


ఫ్లాగ్మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు(ఫైల్)

జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తూ, విధ్వంసానికి ప్రయత్నించే అల్లరిమూకలను అణిచి వేసేందుకు, అత్యవసర సమయాల్లో పరిస్థితిని అదుపులోకి తీసుకొని వచ్చేలా ప్రత్యేక టీములను ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు.

● ప్రతిరోజూ కార్డన్ సెర్చ్

కౌంటింగ్ను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని పోలీసుస్టేషన్ల వారీగా కార్డన్సెర్చ్ ఆపరేషన్లను పోలీసులు నిర్వహిస్తున్నారు. వారం రోజులుగా రోజూ ఏదో ఒకచోట కార్డన్సెర్చ్ జరుగుతూనే ఉంది. ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్న పోలీసులు సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నారు. పరారీలో ఉన్న నేరస్థులను అదుపులోకి తీసుకోవడంతో పాటు, అనుమానితులను కూడా అదుపులోకి తీసుకుంటున్నారు.


రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

- జూన్ 4న ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్
- 17 టేబుళ్లలో నిర్వహణ
- ఈవీఎంలకు 14, పోస్టల్ బ్యాలెట్లకు 2, ఆర్వోకి ఒకటి చొప్పున ఏర్పాటు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్

నెల్లూరు '(హరనాథపురం), మే 23: జిల్లాలో ఓట్ల లెక్కింపును ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ సజావుగా పూర్తయ్యేందుకు పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు సహకరించాలన్నారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని చెప్పారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు గంట కంటే ముందే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్ లేదా అభ్యర్థి సమక్షంలో ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూముల సీల్ ఓపెన్ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఓట్ల లెక్కింపును పరిశీలించేందుకు నలుగురు కౌంటింగ్ పరిశీలకులను ఈసీ నియమించిందన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్ఫోన్లు అనుమతించమని చెప్పారు. కౌంటింగ్ కేంద్రం బయట జడ్పీ హైస్కూల్లో వాహనాల పార్కింగ్కు ఏర్పాట్లు చేశామని చెప్పారు.

● లెక్కింపునకు 17 టేబుళ్లు

జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఒక్కొక్క నియోజకవర్గానికి ఓట్ల లెక్కింపునకు 14 ఈవీఎం టేబుళ్లతోపాటు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు రెండు టేబుళ్లు, ఆర్వోకి ఓ టేబుల్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మొత్తం 17 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నెల్లూరు పార్లమెంటు సెగ్మెంటుకు సంబంధించి 14 ఈవీఎం టేబుళ్లు, ఆర్వోకి ఓ టేబుల్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నెల్లూరు పార్లమెంటుకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు విడిగా జరుగుతుం దన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ఆరు టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఒక్కొక్క టేబుల్ దగ్గర కౌంటింగ్ సూపర్ వైజర్, మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. జూన్ ఒకటోతేదీ సాయంత్రం ఐదుగంటల్లోగా కౌంటింగ్ ఏజెంట్లకు సంబంధించి ఫామ్-18 ను ఆర్వోలకు అందించాలని రాజకీయ పక్షాలను కోరారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, వైసీపీ నుంచి సుబ్బారావు, టీడీపీ నుంచి సురేంద్ర బాబు, బీజేపీ నుంచి శ్రీనివాస్, సీపీఎం నుంచి అజయ్, కాంగ్రెస్ నుంచి బాలసుధాకర్, బీఎస్పీ నుంచి శ్రీరామ్, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి ధరణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● స్ట్రాంగ్ రూముల పరిశీలన

నెల్లూరు శివార్లలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ గురువారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూములను సీసీటీవీల ద్వారా మానిటరింగ్ చేస్తున్న కంట్రోల్ రూమును కూడా వారు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రచారంలో పాల్గొన్న

ఏఆర్ హెచ్సీ సస్పెన్షన్

నెల్లూరు(క్రైం): ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్(హెచ్సీ) మధుసూదన్ రావును జిల్లా ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ సస్పెండ్ చేశారు. ఈ ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నెల్లూరు రూరల్ పరిధిలోని 41వడివిజన్ కార్పొరేటర్ కొవ్వా కొల్లు విజయలక్ష్మీ భర్త మధుసూదన్రావు సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు రూరల్ వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారని జిల్లా కలెక్టర్తో పాటు ఈసీకి ఫిర్యాదులు అందాయి. ఇందుకు సంబంధించి ఫొటోలను, సాక్ష్యాలను టీడీపీ నేతలు అధికారులకు సమర్పించారు. విచారణ చేపట్టిన ఎన్నికల అధికారులు మధుసూదన్ను సస్పెండ్ చేయాలని ఎస్పీని ఆదేశించారు. దీంతో ఎస్పీ ఈ నెల 20న ఆయన్ను సస్పెండ్ చేశారు. నిబంధనలు అతి క్రమించి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం, సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు కావడమనే రెండు కారణాలతో సస్పెండ్ చేశారు.

విడిగా పెట్రోలు పట్టొద్దు !

● బంకులకు పోలీసుల నోటీసులు ● ఈసీ ఆదేశాలతో రైతుల ఇక్కట్లు

నెల్లూరు(క్రైం), మే 23: ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పోలీసుశాఖ అప్రమత్తమైంది. పోలీసుల సోదాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పెట్రోలు బాంబులు లభ్యం అయ్యాయి. దీంతో పెట్రోలు బంకుల్లో వాహనాలకు కాకుండా విడిగా పెట్రోల్‌ను విక్రయించరాదని ఆదేశాలు జారీ చేశారు. విడిగా సీసాలు, క్యాన్లలో పట్టుకొని దాడులకు పాల్పడుతున్నందున ఇక నుంచి వాటిల్లో పట్టకూడదని బంకుల యజమానులకు నోటీసులు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పెట్రోలు బంకులకు నోటీసులు అంటించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో పెట్రోలు పట్టాల్సి వస్తే వారి అడ్రస్సు, ఫోన్ నెంబరు, ఆధార్ కార్డు తీసుకొని, ఆ వివరాలు పోలీసులకు తెలియజేయాలని బంకుల యజమానులను ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో పెట్రోలు బంకుల్లో విడిగా పెట్రోలు పట్టడంలేదు. ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు ఇవే ఆదేశాలు కొనసాగుతాయి.

● ఆదేశాలతో రైతల అగచాట్లు

ఉదయగిరి రూరల్ : విడిగా పెట్రోలు పట్ట వద్దన్న ఆదేశాలతో రైతులు, ట్రాక్టర్ల యజమానులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇటీవల ఓ మోస్తరు వర్షా లు కురవడంతో రైతులు పొలాలు చదును చేయడంలో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో పొలం దున్నేందు కు ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ట్రాక్టర్ల యజమా నులు క్యాన్ల ద్వారా డీజిల్ నింపుకొని తీసుకెళుతుం టారు. ఈసీ ఆంక్షల నేపథ్యంలో వారు ఇబ్బందులు పడుతున్నారు. పెట్రోల్, డీజిల్ అవసరమైన రైతులు సంబం దిత వ్యవసాయాధికారి వద్ద ధ్రువీకరణపత్రం తీసుకెళ్లి క్యాన్లు, సీసాల్లో తీసుకెళ్లవచ్చని అధికారులు చెపుతున్నా వారు అందుబాటులో లేక ఇబ్బందులు తప్పడంలేదు.



నెల్లూరు నగరంలోని ఓ పెట్రోలు బంకులో పోలీసులు అంటించిన నోటీసు

ట్రాక్టర్లకు మినహాయింపు ఇవ్వాలి

పొలం దుక్కి చేస్తున్న సమయంలో ఆయిల్ అయిపోతే ట్రాక్టర్‌ను బంకు వద్దకు తీసుకెళ్లలేం. కావున ట్రాక్టర్లకు మినహాయింపు ఇవ్వాలి.

- ఈర్ల శంకర్, రైతు, కొత్తపల్లి

ధ్రువీకరణపత్రం పొంది తీసుకెళ్లవచ్చు

వ్యవసాయ పనులకు డీజిల్, పెట్రోల్ అవసరం అయిన రైతులు వ్యవసాయాధికారుల నుంచి ధ్రువీకరణపత్రం పొంది తీసుకెళ్లవచ్చు. రైతులకు బంకు యజమానులు కూడా సహకరించాలి.

- కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ, ఉదయగిరి

లూజు పెట్రోల్ విక్రయాలపై కేసుల నమోదు

నెల్లూరు(క్రైం), మే 23: ఉదయగిరి సర్కిల్ పరిధిలోని ఓ పెట్రోల్ బంకులో లూజుగా అమ్మిన ఘటనలో బంకు యజమానిపై, అమ్మిన వ్యక్తిపై, తరలించిన బండగానిపల్లికి చెందిన వ్యక్తులపై కేసులు నమోదు చేశామని జిల్లా ఎస్పీ కె ఆరీఫ్ హఫీజ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే లూజు విక్రయాలు చేయకూడదని బంకుల యజమానులకు నోటీసులు జారీ చేశామని, ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకు ఈసీ నిబంధనలు పాటించాలని ఆయన తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

మర్రిపాడు, మే 23: సింగ నపల్లి సమీపంలోని 656వ నెంబర్ జాతీయ రహదారిపై గురువారం లారీ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న కావలి మండలం ముసనూరు గ్రామానికి వేణు గోపాల్ రెడ్డి(40) అక్కడికక్కడే మృతి చెందాడు. అతను మర్రిపాడు మండలం బూద వాడలోని అత్తగారి ఇంటికి బుధవారం వచ్చారు. గురువారం ఉదయం సరదాగా పీపీ కుంట వరకు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా ఈ దర్ఘటన జరిగింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పం చనామా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


సంఘటనా స్థలంలో ఉన్న వాహనాలు

ఆస్తి పంచలేదని వరినారుపై గడ్డిమందు పిచికారీ

● తల్లిమీద కోపంతో కొడుకు దారుణం ● పనికిరాకుండాపోయిన నారు, పొలం


తల్లిమీద కోపంతో గడ్డిమందు పిచికారీ చేయడంతో పనికిరాకుండా పోయిన వరినారు. నాట్లు వేయాల్సిన పొలం

బుచ్చిరెడ్డిపాళెం, మే 23: తనకు ఆస్తి పంచలేదని తల్లిమీద కోపంతో ఓ కొడుకు నాట్లు వేసేందుకు పెట్టిన వరినారుపైన, వరినాట్లు వేయాల్సిన పొలం లో కలుపు (గడ్డి)మందు పిచికారీ చేసిన దారుణ సంఘటన మండలంలోని చెల్లాయపాళెం పల్లిపాళెంలో చోటుచేసుకుంది. గురువారం వెలుగు చూసిన ఈ సంఘటనకు సంబంధించి బాధిత రైతు నెల్లూరు సులోచనమ్మ వివరాల మేరకు గత కొన్నేళ్ళ క్రితం సులోచనమ్మ భర్త మృతి చెందాడు. వున్న వ్యవసాయ భూమిలో కొంత పెద్దకొడుక్కి పంచి, మిగతా వ్యవసాయ భూమిని వివాహం కాని చిన్నకొడుకు మహేష్‌తో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. రెండు కుటుంబాలు ఒకే ఇంట్లో రెండు వేర్వేరు గదుల్లో కాపురాలుంటున్నారు. ఇటీవల పెద్దకొడుకు నరేంద్ర మొత్తం ఆస్తిని వాటాలు పెట్టాలని గొడవకు దిగాడు. చిన్నకొడుకు మహేష్‌కు వివాహం అయ్యేదాకా ఆస్తి పంచనని చెప్పేసింది. దీంతో సులోచనమ్మ తమ వ్యవసాయ భూమిలోని ఓ 60సెంట్లు పొలంలో బుధవారం వరినాట్లు వేసేందుకు మంగళవారం నారుమడిలోని వరినారు పెరికి ఆ కయ్యలోనే నాట్లుకు సిద్ధంగా వుంచారు. బుధవారం పొద్దున్నే చిన్నకొడుకు మహేష్ పొలం వద్దకు వెళ్ళేసరికి వరినారు కొసలు, గట్లుమీద పచ్చిగడ్డి ఎండిపోయి కనిపించడంతో ఖంగు తిన్నారు. చుట్టుపక్కల విచారించి పెద్ద కొడుకు మహేష్ కలుపు(గడ్డి) మందు పిచికారీ చేసినట్లు తెలుసుకున్నారు. ఈ సమాచారంతో సులోచనమ్మ పొలంవద్దకు చేరుకుని తీవ్ర ఆవేదనకు గురైంది. కలుపు మందు పిచికారీ వల్ల వరినారు పనికిరాదని, 4నెలలుపాటు పొలంలో ఏ పైరు వేసినా బతకదని చుట్టుపక్కల రైతులు చెప్పారని, ఈ పంట పండితేనే తమకు బతుకు జీవనమని సులోచనమ్మ కన్నీటి పర్యతంమైంది. ఈమేరకు బాధితురాలు సులోచనమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. కాగా, గ్రామ వలంటీరుగా పదిమందికి మంచి చేయాల్సిన పెద్ద కొడుకు నరేంద్ర ఇలా వరినారుపైన, నాట్లు వేయాల్సిన పొలంలో గడ్డి మందు పిచికారీ చేయడంపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చోరీ జరిగిన ఇంట్లో క్లూస్‌టీం పరిశీలన

ఉదయగిరి రూరల్ మే 23: పట్టణంలోని బాలాజీ నగర్‌లో ఉంటున్న రేకలగుంట పొలయ్య ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి గురువారం విచారణ చేపట్టారు. చోరీ జరిగిన ఇంట్లో క్లూస్‌టీంతో పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. చోరీకి గురైన వస్తువుల వివరాలను ఆరా తీశారు. కార్యక్రమంలో ఎస్ఐలు సునీల్, వినయ్ సిబ్బంది పాల్గొన్నారు.


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	172
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	300
స్కిన్‌లెస్	330
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6918
వెండి కిలో ధర	రూ. 92,400
వెండి ఒక గ్రాము	రూ. 94.40

చాముండేశ్వరి ఆలయ హుండీ లెక్కింపు

ఇందుకూరుపేట, మే 23 : మండలంలోని గంగపట్నం గ్రామంలో శ్రీ చాముండేశ్వరి అమ్మవారి దేవస్థానంలో గురువారం ఇందుకూరుపేట గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వాహణాధికారి మస్తాన్‌బాబు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు నిర్వహించారు. 2024 జనవరి 6వ తేదీ నుంచి మే 23 వరకు అమ్మవారి హుండీ ద్వారా రూ.6,55,850, అన్నప్రసాదాలకు రూ.24,899 ఆదాయం లభించింది. ఈ లెక్కింపు కార్యక్రమంలో కెనరా బ్యాంకు మేనేజర్ ఎం శ్రీహరి, శ్రీవిద్యాసాగర్‌రావు, రిటైర్డ్ బ్యాంకు ఎంప్లాయిస్ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారని ఆలయ కార్యనిర్వాహణాధికారి బండి శాంతయ్య తెలిపారు.

గొలుసు దుకాణంపై దాడి

మనుబోలు, మే 23: ముద్దమూడిలో గొలుసు దుకాణం నిర్వహిస్తున్నట్లు ముందస్తు సమాచారంతో బుధవారం రాత్రి ఎస్ఐ అజయ్‌కుమార్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. గ్రామంలోని దళితవాడలోని ఇంట్లో తాటిపర్తి లక్ష్మీ గొలుసు దుకాణం నిర్వహిస్తుం డగా అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్దనున్న 14 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డ్యూటీలో నకిలీ పోలీసు వదంతులు అవాస్తవం

● జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్

ఆత్మకూరు, మే 23: మండలంలోని రామస్వామిపల్లి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల రోజు నకిలీ పోలీస్ డ్యూటీ చేశారని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్త అవాస్తవమని ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ వివరణ ఇచ్చారు. ఆ రోజు నెల్లూరుకే చెందిన ఏఆర్ పీసీ తిరుమలవాసుకి డ్యూటీ వేసినట్లు చెప్పారు. నేమ్ ప్లేట్‌లో బ్యాడ్జ్ నెంబరు లేని డ్యూప్లికేట్ పోలీస్ విధులు నిర్వహించినట్లు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విచారణ చేపట్టామన్నారు. పోలింగ్ కేంద్రంలోని వీడియోను పరిశీలించి డిపార్ట్‌మెంట్ నియమించిన తిరుమలవాసు డ్యూటీలో ఉన్నాడని తేల్చా రు. అయితే అతని నేమ్ ప్లేట్‌లో బ్యాడ్జ్ నెంబరు డ్యామేజ్ కావడంతో అతికించి ఉండడంతో అలా జరిగిందని తెలిపారు. ఆ మేరకు సంబంధించిన ఏఆర్ పీసీ తిరుమలవాసుకు నోటీస్ అందచేసి వివరణ తీసుకున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో డూప్లికేట్ పోలీస్ విధులు నిర్వహించారని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తను నమ్మవద్దని ఎస్పీ జిల్లా పౌరసంబంధాల అధికారి ద్వారా వీడియోకు గురువారం ప్రకటన విడుదల చేశారు.

అక్రమాలకు పాల్పడిన ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

● అధికారులకు ముదివర్తి గ్రామస్థుల వినతి

విడవలూరు, మే 23: ప్రభుత్వం పేద ప్రజలకు అందజేసిన పథకాల అమలులో అక్రమాలకు పాల్పడిన సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై తగిన చర్యలు తీసుకోవాలని ముదివర్తి గ్రామస్థులు అధికారులను కోరారు. గ్రామంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామంలో జరిగిన నాడు-నేడు పనుల్లో సదరు ఇంజనీరింగ్ అసిస్టెంట్ భారీగా అవినీతికి పాల్పడ్డారన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి సిమెంటు, కమ్మి (ఇనుము)లో భారీ అక్రమాలు జరిగాయన్నారు. అదేవిధంగా జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో ఇసుక కూపన్‌లను అమ్మేశాడని, గతంలో కట్టిన మరుగుదొడ్లకు బిల్లులు చేసుకుని రూ. వేలల్లో దిగమింగారని వారు ఆరోపించారు. ఈ ఇంజనీరింగ్ అసిస్టెంట్ చేస్తున్న అక్రమాలపై మండల అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సదరు ఇంజనీరింగ్ అసిస్టెంట్ అవినీతిపై సమగ్ర విచారణ జరిపితే మరికొన్ని అవినీతి వ్యవహారాలు వెలుగులోకి వస్తాయని గ్రామస్థులు తెలిపారు. ఈ సమావేశంలో గ్రామస్థులు శ్రీనివాసులు, నాగూరుబాషా, కరిముల్లా, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముదివర్తి గ్రామస్థులు

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

● నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ ● జిల్లాలో 80 పరీక్ష కేంద్రాలు

● హాజరుకానున్న 25,929 మంది విద్యార్థులు

నెల్లూరు (విద్య), మే 23 : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్ష లను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యా ర్థులు నిర్ణీత సమయం కన్నా నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్ష కేంద్రంలోకి అనుమతించేది లేదని ఇంటర్‌బోర్డు అధికారులు స్పష్టం చేశారు. సమస్యలేమైనా ఉంటే ఆర్ఐవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్‌కు ఫోన్ చేసి పరిష్కరించుకోవాలని ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు సూచించారు. గురువారం నగరంలోని ఇంటర్‌బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను జిల్లాలో 80 కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 51 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 29 కేంద్రాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రథమ సంవత్సరంలో జనరల్ కేటగిరిలో 19,826 మంది, ఒకేషనల్ విభాగంలో 491 మంది కలిపి మొత్తం 20,317 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని చెప్పారు. వీరిలో 12,687 మంది ఇంప్రూవ్‌మెంట్ రాస్తుండగా మిగిలిన వారు ఫెయిల్ అయిన సబ్జెక్టులకు హాజరవుతున్నారన్నారు. అలాగే ద్వితీయ సంవత్స రంలో జనరల్ విద్యార్థులు 5,074 మంది, ఒకేషనల్ వారు 538 మంది కలిపి మొత్తం 5,612 మంది పరీక్షలకు హాజరవుతున్నా రన్నారు. మొత్తం మీద ఈ పరీక్షలకు 25,929 మంది విద్యార్థులు హాజరవుతారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐవో శ్రీనివాసులు

ప్రత్యేక కమిటీలు, బృందాలు

పరీక్షలకు కట్టుదిట్టంగా నిర్వహించేందుకు హైపవర్ కమిటీతోపాటు జిల్లా పరీక్షల కమిటీ, ఫ్లైయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించినట్లు ఆర్ఐవో తెలిపారు. కలెక్టర్ ఎం హరినారాయణన్ ఆధ్వర్యంలో డీఆర్వో లవన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన హైపవర్ కమిటీ ఎప్పటికప్పుడు పరీక్షల తీరును పర్యవేక్షిస్తుందని చెప్పారు. గతంలో ఉన్న డిపార్ట్ మెంటల్ ఆఫీసర్ స్థానాన్ని రద్దుచేసి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లతో పాటు అడిషనల్ చీఫ్ సూప రింటెండెంట్‌ను నియమించామన్నారు. జిల్లాలో కొనసాగుతున్న డీఆర్‌డీసీ వ్యవస్థను రద్దు చేసి ఎంపిక చేసిన ఆర్ఆర్ఎస్‌సీల ద్వారా జవాబు పత్రాల సేకరణ, స్కానింగ్ ప్రక్రియను నిర్వహిస్తామని వివరించారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్‌లను అనుమతించరన్నారు. బోర్డు మంజూరు చేసిన బేసిక్ మోడల్ మొబైల్స్ మాత్రమే వాడాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఫీజు చెల్లించలేదని హాల్ టికెట్ నిరాకరిస్తే సదరు కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షల నిర్వహణ సమాచారం పొందేందుకు, ఫిర్యాదులు చేసేందుకు ఆర్ఐవో కార్యాలయంలో ఫోన్ 0861-2320312 నెంబర్‌తో కంట్రోల్ రూము అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో డీఈసీ సభ్యులు దీనదయాళ్, పీ వేణుగోపాల్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 7.615 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, మే 23: సోమశిల జలాశయం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు. గురువారానికి 7.615 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికా రులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసె క్కులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.


సంగం మండలం తరుణవాయి పంచాయతీ కార్యాలయం (ఫైల్)

● పంచాయతీ కార్యదర్శుల ప్రశ్న
● జీవో వచ్చి మూడు నెలలైనా అమలు కాని వైనం
● ప్రస్తుతం సచివాలయాలకే పరిమితం
● అస్తవ్యస్తంగా గ్రామ పంచాయతీల పనితీరు

అధికారాలు ఎప్పుడిస్తారు ?

సంగం, మే 23 : వారంతా పేరుకే పంచాయతీ కార్యదర్శులు.. కానీ వారి విధులన్నీ సచివాలయాలకే పరిమితం.. ఓ వైపు వందలాది పంచాయతీల్లో పోస్టులు ఖాళీగా ఉన్నా.. పంచాయతీ కార్యదర్శులు కళ్లెదుటే ఉన్నా... వారికి మాత్రం అధికారాలు దక్కలేదు. కార్యదర్శులు లేక పంచాయతీల పనితీరు పూర్తిగా దెబ్బతింటున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. కార్యదర్శులకు అధికారాలు ఇస్తామని 2022లోనే జీవో నెంబరు 149ని విడుదల చేసిన ప్రభుత్వం దాన్ని బుట్టదాఖలు చేసింది. తాజాగా ఎన్నికల హడావుడి నేపథ్యంలో ఫిబ్రవరి 15న మరోమారు జీవో ఎంఎస్ నెం.11 పేరుతో మరో జీవో విడుదల చేసింది. ఈసారి కూడా అది అమలుకు నోచుకోలేదు. దీంతో పంచాయతీ వ్యవస్థ ఎప్పుడు గాడినపడుతుందో ఎవరికీ తెలియడం లేదు.

● మూడు నెలల క్రితమే జీవో

జిల్లాలో 722 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 659 గ్రామ సచివాలయాలున్నాయి. ఇవి కాకుండా మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లో మరో 262 వార్డు సచివాలయాలున్నాయి. జిల్లాలో సుమారుగా 416 మందికిపైగా గ్రేడ్ 1,2,3,4 పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. గత ప్రభుత్వంలో జిల్లాలోని పంచాయతీలను 436 క్లస్టర్లుగా విభజించి ఒక్కొక్క క్లస్టర్‌కు ఒక్కొక్క పంచాయతీ కార్యదర్శిని నియమించింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఒక్కొక్క పంచాయతీకి ఒక్కొక్క కార్యదర్శిని నియమించాలనే ఉద్దేశంతో 2020లో సచివాలయ పరీక్షల పేరుతో గ్రేడ్- 5 కింద రిక్రూట్ చేసుకుంది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఒక్కొక్క పంచాయతీకి ఒక్కొక్క కార్యదర్శి ఉన్నా గ్రామ పంచాయతీల పాలన మాత్రం గ్రేడ్ 1,2,3,4 కార్యదర్శుల ఆధ్వర్యంలోనే సాగుతోంది.

● ఒక్క కార్యదర్శి మాటేంటి?

జిల్లాలో సచివాలయ పోస్టులు ఎంపిక కాక ముందు 416 మంది గ్రేడ్ 1,2,3,4 కార్యదర్శులు ఉన్నారు. జిల్లాలోని 722 పంచాయతీలను రెండు, మూడు పంచాయతీలను కలిపి క్లస్టర్‌గా ఏర్పాటు చేసి వీరికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఒక పంచాయతీ.. ఒక కార్యదర్శి పేరుతో సచివాలయ పరీక్షల్లో ఎంపికైన వారిని నియమించినా వారికి మాత్రం పూర్తి విధులు దక్కలేదు. సీనియర్ కార్యదర్శి కనుసన్నల్లో వీరు పనిచేయాల్సి ఉంది. దీంతో ఒక్క పంచాయతీ.. ఒక్క కార్యదర్శికి మోక్షం దక్కలేదు.

● అస్తవ్యస్తంగా పంచాయతీ పాలన

సచివాలయ పరీక్షల ద్వారా ఎంపికైన కార్యదర్శులకు డీడీవో కోడ్ విధులు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులుగా నియమించిన డీడీవో కోడ్ ఉన్న సీనియర్ గ్రేడ్ - 1,2,3,4 కార్యదర్శులదే పెత్తనమైందిజ దీంతో వీరు పంచాయతీ కార్యదర్శులుగా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. దీంతో పంచాయతీల పాలన అస్తవ్యస్తగా మారింది. గ్రామాల్లో పరిశుభ్రత, తాగునీరు, వీధిలైట్ల నిర్వహణ పట్టించుకునే వారు లేక ఆ భారం సర్పంచులపైన పడింది. కొత్త ప్రభుత్వంలోనైనా ఒక్క పంచాయతీకి.. ఒక్క కార్యదర్శి చొప్పున నియమించి డీడీవో కోడ్‌ను జారీ చేయాలని సచివాలయ పరీక్షల్లో ఎంపికైన కార్యదర్శులు కోరుతున్నారు.

అమలు కాని జీవో

మూడు నెలల కిందట జీవోఎంఎస్ నెంబరును 11ని విడుదల చేశారు. ఈ జీవో ప్రకారం గ్రామ జనాభా 500 దాటిన ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శిని నియమించాలి. ఇందు కోసం అదనంగా మరికొన్ని గ్రామ పంచాయతీలకు డీడీవో కోడ్‌ను కొత్తగా రూపొందించాల్సి ఉంది. అప్పుడు మాత్రమే పంచాయతీల సంఖ్యతో సమానంగా కార్యదర్శులు వున్నా.. అది ఆచరణకు నోచుకోలేదు. ఉద్యోగుల ఆందోళన చేసినప్పుడల్లా తూతూ మంత్రంగా చర్యలు తీసుకోవడమే తప్ప ఫలితం లేదు. ఒక పంచాయతీ ఒక కార్యదర్శి దస్త్రాలపై కిందటేడాది సెప్టెంబరులోనే సీఎం సంతకం చేసినా ఈ రోజు వరకూ అది ఆచరణకు నోచుకోలేదు. దీంతో జీవోనే పెద్ద బూటకమని అర్థమై ఎన్నికల ముందు కార్యదర్శులు ఆందోళన చేపట్టారు. కానీ ఫలితం లేకుండా పోయింది.

విద్యుదాఘాతంతో భార్యాభర్తల మృతి

● కుటుంబంలో విషాదం

తోటపల్లిగూడూరు, మే 23: చిన్నచెరుకూరుకు చెందిన భార్యాభర్తలు అన్నం నరసయ్యగౌడ్ (60), అన్నం భాగ్యమ్మ (55)లు బుధవారం అర్ధరాత్రి విద్యుత్ షాక్‌కు గురై మరణించారు. ఎస్ఐ జంపానీకుమార్ తెలిపిన వివరాలు మేరకు.. అన్నం నరసయ్య రాత్రి 10గంటల సమయంలో ఇంటిలోని ఓ గదిలో టేబుల్ ఫ్యాన్ (ఇనుపది) పెట్టు కుని నిద్రపోయాడు. ఆ సమయంలో టేబుల్ ఫ్యాన్‌కి ఉన్న వైరు షాక్ సర్క్యూట్ జరిగి నరసయ్య మర ణించాడు. అనంతరం ఉదయం 5గంటల సమయంలో అతని భార్య అన్నం భాగ్యమ్మ అతని భర్తను చూడ టానికి వెళ్లి ఆమెకు కూడా కరెంటు షాక్ కొట్టడంతో అక్కడే మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమారులు రాజేష్, రాకేష్ గౌడలు. వీరు ఉదయం నిద్రలేచి చూడగా కరెంటు షాక్ కొట్టినట్లుగా పడిపోయి ఉన్న వారిని గుర్తించి ఇంటికి ఉన్న మెయిన్‌ను ఆపివేసి పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి ఈ విషయం పై కేసు నమోదు చేసుకున్నారు. తల్లిదండ్రులు కోల్పో యిన పిల్లలను చూసి స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.


భార్యాభర్తల మృతదేహాలు

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ

● 39 కేంద్రాలు, 7,083 మంది విద్యార్థులు

నెల్లూరు (విద్య), మే 23 : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి జరగనున్నాయి. జూన్ 3వతేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని 39 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారు, 7,083 మంది విద్యార్థులు హాజరుకానున్నాయి. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి 12.40 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాల వద్ద హాజరు కావాలని అధికారులు సూచించారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు 39 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 39 మంది డిపార్ట్‌మెంట్ అధికారులతోపాటు 600 మంది ఇన్విజిలేటర్ల నియమించారు. ప్రశ్నపత్రాలను కేంద్రాలకు సమీపంలోని పోలీస్‌స్టేషన్లలో భద్రపరచగా పరీక్ష సమయానికి అరగంట ముందుగా ఆయా సెంటర్లకు చేరవేస్తామని అధికారులు పేర్కొన్నారు. మాస్ కాపీయింగ్‌ను అరికట్టేందుకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్‌తో పాటు కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులను రెగ్యులర్ విద్యార్థులుగానే పరిగణిస్తామని, మార్కుల జాబితా కూడా రెగ్యులర్ విద్యార్థుల మాదిరిగానే వస్తుందని డీఈవో రామారావు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పరీక్షలకు హాజరు కావాలని ఆయన సూచించారు.

నత్తనడకన నాడు-నేడు పనులు



ఉదయగిరి ఉన్నత పాఠశాలలో చెట్ల కిందే పాఠాలు వింటున్న విద్యార్థులు (ఫైల్)



అసంపూర్తిగా అదనపు తరగతి గదుల నిర్మాణం

- చెట్ల కిందే విద్యార్థుల చదువులు
- బడులు తెరిచేలోపు పనులు పూర్తయ్యేనా?

ఉదయగిరి రూరల్, మే 23: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా తీర్చిదిద్దుతాం.. నాడు-నేడు పనులతో పాఠశాలల రూపు రేఖలు మార్చేస్తామంటూ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసింది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు నత్తనకడన సాగుతున్నాయి. నిధుల కొరతతో పనులు అర్థాం తరంగా నిలిచిపోతున్నాయి. ఫలితంగా అరకొర వసతులు, అసంపూర్తి గదుల్లో తరగతుల నిర్వహణతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని గడ్డంవారిపల్లి, కృష్ణంపల్లి, బిజ్జంపల్లి, ఉదయగిరి, అప్పసముద్రం ఉన్నత పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగా మిగిలి పోవడంతో విద్యార్థులకు ఉపాధ్యాయులు చెట్ల కింద విద్యాబోధన చేయాల్సిన దుస్థితి నెలకొంది. విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తయి తమ కష్టాలు తీరుతాయో లేదోనని ఎదురుచూస్తున్నారు.

ఉదయగిరి మండలంలో..

నాడు-నేడు పథకం కింద రెండోవిడత మరమ్మతులు చేపట్టేందుకు 25 పాఠశాలను ఎంపిక చేశారు. వీటిలో రూ.10.48 కోట్లతో పనులు చేపట్టేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పనులకు సంబంధించి ఇప్పటి వరకు రూ.4.23 కోట్లు నిధులు మంజూరు చేయగా, మరో రూ.4.09 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక నిర్మాణాలకు సిమెంట్, మరుగదొడ్లకు అవసరమైన సామగ్రిని ప్రభుత్వమే మంజూరు చేస్తుంది. కొంతమంది ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బులు మరమ్మతుల కోసం వినియోగించి 80శాతం పనులు పూర్తి చేయించారు. ప్రభుత్వం నిధులు సకాలంలో విడుదల చేస్తే పనులు త్వరితగతిన పూర్తవు తాయని వారు చెబుతున్నారు. ఉదయగిరి ఉన్నత పాఠశాలలో 600మంది విద్యార్థులు చదు వుతున్నారు. ఈ పాఠశాలకు రూ.1.51 కోట్లతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. కానీ ఇప్పటివరకు ఇచ్చింది కేవలం రూ.67.19లక్షలు మాత్రమే. ఉన్న పది తరగతి గదులు సైతం శిథిలావస్థకు చేరాయి. వారికి సరిపడా తరగతి గదులు లేకపోవడంతో ఉపాధ్యాయులు చెట్ల కింద విద్యాబోధన చేస్తున్నారు. పాఠశాల క్రీడామైదానం ఆవరణలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణం చివరిదశలో నిలిచాయి. గడ్డంవారిపల్లి, కృష్ణంపల్లి, బిజ్జంపల్లి, అప్పసముద్రం తదితర పాఠశాలల్లో అదనపు తరగతుల నిర్మాణం, ఇతరత్రా పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవస్థ లు తప్పడంలేదు. ప్రభుత్వం స్పందించి నిధులు త్వరితగతిన మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేస్తాం..
షేక్ మస్తాన్‌వలి, ఎంఈవో, ఉదయగిరి

మండలంలో మనబడి నాడు-నేడు పథకం కింద రెండోవిడతలో మంజూరైన పనులు త్వరితగతిన పూర్తి చేసి విద్యా సంవత్సరం ప్రారంభానికి పూర్తయ్యేలా చర్యలు చేపడతాం. అదనపు తరగతి గదుల నిర్మాణం 80 శాతం పనులు పూర్తయ్యాయి.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పగిలిన పైపులైన్

- పట్టణంలో ఆగిన తాగునీటి సరఫరా
- ప్రజల అవస్థలు



చర్చి సమీపంలో పగిలిన మంచినీటి ప్రధాన పైపులైన్

కావలి, మే 23: పట్టణానికి మంచినీటి సరఫరా అయ్యే ప్రధాన పైపులైన్ గురువారం తెల్లవారుజామున ఆర్వోబీ వంతెన పక్కన చర్చి సమీపంలో పగిలి పోవటంతో పాటు సీసీ రోడ్డంతా ధ్వంసమైంది. దీంతో గురువారం ఉదయం నుంచి పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పగిలిన పైపులైన్ మరమ్మతులు పూర్తయ్యేసరికి రెండు రోజులు సమయం పట్టనుండడంతో అప్పటివరకు పట్టణ వాసులకు తాగునీటి కష్టాలు తప్పేట్లు లేదు. రైల్వేట్రాక్ నుంచి ఏరియా వైద్యశాల వరకు ఆ మార్గంలో ఉన్న ప్రధాన పైపులైన్ పూర్తిగా దెబ్బతిని రోడ్డు కూడా పాడైపోయింది. రోడ్డు మధ్యలో పైపులైన్ వేసి ఉండటం, దానిపైన సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో తరచూ పైపులైన్ పగిలినపుడల్లా రోడ్డు పగులకొడుతుండడంతో రాకపోకలు కూడా స్తంభించిపోతున్నాయి. పావు కి.మీ దూరంలో సుమారు పది చోట్లకు పైగా పైపులైన్ పగిలి అతుకులు వేయడంతో ఆ మార్గంలో పైపులైన్ ద్వారా పట్టణానికి నీటిసరఫరా దినగండంగా మారింది. దీంతో ఐడీఎస్ఎంటీ ప్లాంట్ల నుంచి ట్రంకురోడ్డులోని కలికి యానాదిరెడ్డి విగ్రహం వరకు పాడైపోయిన పాత పైపులైన్ తొలగించి శాశ్వత ప్రాతిపదికన ఐరన్ పైపులైన్ వేసేందుకు మున్సిపల్ అధికారులు మూడేళ్ల కిందట ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినా నిధులు మంజూరు కాకపోవడంతో ఆ పైపులైన్‌కు మోక్షం లభించక తరచూ దెబ్బతిని నీటిసరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్‌కు శాశ్వత పరిష్కారం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సేంద్రీయ ఎరువుల వినియోగం శ్రేయస్కరం

కావలి రూరల్, మే 23: ఎరువులు, పురుగు మందుల అధిక వాడకం భూసారానికే ముప్పు అని, సేంద్రీయ ఎరువుల వినియోగం శ్రేయస్కరం అని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి పి సత్యవాణి పేర్కొన్నారు. కావలి మండలం తాళ్లపాలెంలో గురువారం భూసార పరి రక్షణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ భూసారాన్ని పరిరక్షించుకునేందుకు మట్టినమూనాలు చేయించుకుని వాటికి అనుగుణంగా ఎరువుల వాడకం చేపట్టాలన్నారు. కాగా, భూసారం పెంచుకునేందుకు రైతులకు రాయితీపై జీలగలు, పిల్లిపెసరలు అందుబాటులో ఉంచినట్లు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మద్దూరుపాడులోని విత్తన తయారీ కేంద్రంలోని నిల్వలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఏడిఏ నర్సోజీరావ్, కావలి డివిజన్ ఏడిఏ నాగరాజు, మండల వ్యవసాయశాఖ అధికారిణి ఏ లలిత, రైతులు పాల్గొన్నారు.



కావలి రూరల్: మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి

కందుకూరు: రైతులు నానో ఎరువుల వాడకాన్ని అలవాటు చేసుకోవాలని కందుకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు పి అనసూయ సూచించారు. మండలంలోని విక్కిరాలపేట, కొండి కందుకూరు రైతు భరోసా కేంద్రాలలో భూసార పరిరక్షణకై రైతులకు అవ గాహన సదస్సు మండల వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో గురు వారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ అనసూయ మాట్లా డుతూ నానో యూరియా, నానో డీఏపీ మార్కెట్లో అందుబాటులో ఉన్నాయని, వీటిని పైర్లకు పైపాటుగా పిచికారీ చేయడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయని వివరించారు. నానో ఎరువుల వాడకంతో పాటు తొలకరిలో పచ్చిరొట్ట పైర్లు సాగుచేసి వాటిని పూతదశలో భూమిలో కలియ దున్నటం అలవాటు చేసుకుంటే అద్భుత ఫలితాలు సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు డి రోషిణి, కె చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు

సంగం, మే 23: సర్కిల్ పరిధిలోని సంగం, ఏఎస్ పేట, చేజర్ల మండలాల్లో పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందని, ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సంగం సీఐ రవినాయిక్ హెచ్చరించారు. గురువారం ఆయన స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కౌటింగ్ రోజు ర్యాలీలు, సభలు నిర్వహించరాదన్నారు. బాణాసంచా కల్చడాన్ని నిషేధిస్తూ ఎన్నికల సంఘం ఆదేశించింది. ఇందులో ఎవరికీ ఎలాంటి అనుమతులు లేవన్నారు. కౌటింగ్ ముగిసే వరకు 144 సెక్షన్ అమలులో ఉన్నందున నాయకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థుల సర్వే

ఉదయగిరి రూరల్ మే 23: మండలంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల సర్వేను గురువారం భవితకేంద్రం ఐఆర్పీలు శివనందిని, సుభాష్‌చంద్రబోస్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏపీడీ ఉషారాణి ఆదేశాలతో సచివాలయాల పరిధిలో సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వే ద్వారా గుర్తించిన విద్యార్థులకు భవిత కేంద్రంలో ప్రవేశం కల్పించి ప్రతేక అలెవెన్స్‌లు కల్పిస్తామన్నారు. దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు, మంచానికి పరిమితమైన వారికి ఇంటి వద్దే బోధన, హోమ్ అలెవెన్స్‌లు ఇవ్వడం జరుగుతుందని వివరించారు.

200ఎకరాల్లో పండ్లతోటల సాగు లక్ష్యం



మాట్లాడుతున్న ఏపీడీ గాయత్రిదేవి

ఉదయగిరి రూరల్ మే 23: ఈ ఆర్థిక సంవత్సరంలో మండలంలో 200ఎకరాల్లో పండ్లతోటల సాగు లక్ష్యంగా నిర్ణయించామని ఉపాధిహామీ ఏపీడీ గాయత్రీదేవి తెలిపారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఆమె సిబ్బందితో సమీక్ష నిర్వహించి అవగాహన కల్పించారు. క్షేతస్థాయి పరిశీలన చేసి పండ్లతోటల సాగుకు ప్రణాళికలు రూపొందించాలని కోరారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలకు ఉపాధి పనులు కల్పించి కూలీల శాతం పెంచాలన్నారు. వేసవి దృష్ట్యా ప్రభుత్వం నిర్దేశించిన రూ.300 కూలీ గిట్టుబాటు అయ్యేలా కొలతల ప్రకారం పనిచేయించాలని.. పనుల వద్ద వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం 6నుంచి 11గంటల వరకు పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఏపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఉదయగిరి రూరల్ , మే 23: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు జరుగనున్న ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్ష కేంద్ర చీఫ్ సూపరింటెండ్ వాసుబాబు గురువారం తెలిపారు. కేంద్రంలో 144 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు.

వైభవంగా పాండురంగ విఠలేశ్వరుడి రథోత్సవం

సీతారామపురం, మే 23: పండ్రంగి గ్రామ సమీపంలోని పాండురంగ విఠలేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలకేంద్రంలోని తోటవీధి, తూర్పువీధి వారు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథోత్సవం, పారువేట కనులపండువగా సాగింది. ఈ సందర్భంగా పండరిభజన, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలను తిలకించేందుకు అన్ని గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఆవరణలో నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

సీతారాముల వసంతాల వేడుక

దేవిశెట్టిపల్లి ప్రసన్న కోదండ రామస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం సీతారాములకు వసంతాల వేడుకలు నిర్వహించారు. అందరు కలిసి వంతాలు చల్లుకుని ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామి రథోత్సవం, పారువేటలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు, ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనరసింహుడి కల్యాణం

అనంతసాగరం: ఉప్పలపాడులో వెలసిన లక్ష్మీనరసింహుని ఆలయంలో గురువారం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. స్వామి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో మూడురోజులుగా ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి.

ముగిసిన సీతారాముల ఉత్సవాలు



పప్పులవారిపల్లి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉదయగిరి రూరల్: పప్పులవారిపల్లిలో జరుగుతున్న కోదండ రామస్వామి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం, గ్రామోత్సవం, పారువేట కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమలకు భక్తులు అధికంగా పాల్గొని, మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో సయ్యద్ ఉస్మాన్ గంధం మహోత్సవం

ఉదయగిరి, మే 23: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని సయ్యద్ ఉస్మాన్ సాహెబ్ గంధం మహోత్సవం గురువారం రాత్రి దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పకీరు జరుబులు విద్యుత్ దీపాల నడుమ పురవీధుల్లో ఊరేగింపుగా గంధంను తీసుకుని దర్గాకు చేరుకున్నారు. అనంతరం గ్రంథాన్ని చదివి భక్తులకు వినిపించారు. ఈ సందర్భంగా దర్గా వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

కోడి పందెం స్థావరంపై పోలీసుల దాడి


వరికుంటపాడు, మే 23: విరువూరు గ్రామ శివారులో గురువారం నిర్వహించిన కోడి పందెల స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుగురు వ్యక్తులు, 9 పందెం కోళ్లు, 20 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిరుపతయ్య తెలిపారు. పందెం రాయుల వద్ద నుంచి రూ.5,700లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.



పట్టుబడిన ద్విచక్ర వాహనాలు

నేలపైనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఉదయగిరి, మే 23 : స్థానిక ఆనకట్ట సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నేలపైనే ఉంది. ఆనకట్ట ఆధునికీకరణ పనుల్లో భాగంగా ఆనకట్ట చుట్టూ మట్టికట్టను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు నేలపై ఉంచి విద్యుత్ సరఫరా కొనసాగిస్తున్నారు. అయితే ఉదయం, సాయంత్రం వాకింగ్ వెళ్లే ప్రజలు, పశువుల సంచారం అధికంగా ఉంటుంది. అలాగే నివాసాలకు సమీపంలో ఉండడంతో చిన్నారులకు సైతం దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఆనకట్ట సమీపంలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కొరవడిన పారిశుధ్యం

అనంతసాగరం, మే 23: పాతదేవరాయపల్లిలోని తుమ్మలమ్మ ఆలయం వద్ద ఉన్న చేతిపంపు చుట్టూ మురుగునీరు చేరి స్థానికులకు ఇబ్బందులు కలుగుతోంది. పంపు నుంచి వచ్చే వృథా నీరు బయటకు పోయే వెసులుబాటు లేక చిత్తడిగా మారి పరిసరాల్లో దుర్వాసన వస్తుంది. అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



బిట్రగుంట: కొత్తూరు రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బిట్రగుంట, మే 23: బోగోలు మండలం నాగులవరం పంచాయతీ చెన్నారెడ్డిపాలెం కొత్తూరు కోదండరామస్వామి ఆలయంలో నరసింహ జయంతి సందర్భంగా గురువారం సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. సీతారాముల ఉత్సవాలలో భాగంగా ఉదయం సీతమ్మవారి గిన్నె గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం గ్రామస్థుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం జరిగింది. ఉభయ కర్తలుగా యర్రం శ్రీనివాసులురెడ్డి, ప్రభావతి దంపతులు వ్యవహరించారు. రాత్రి స్వామివారి పట్టాభిషేకం, గ్రామోత్సవం నిర్వహించారు.

కొండాపురం: మండలంలోని నేకునాంపేట గ్రామంలో భక్తులు సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు పండితులు తీర్థప్రసాదాలు అందచేశారు. గుడవళ్లూరు, పార్లపల్లి, కొమ్మి తదితర గ్రామాలలో ఉత్సవాల సందర్భంగా ఆలయాల వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటుచేశారు.

కలిగిరి: మండలంలోని కుమ్మరకొండూరు గ్రామంలో గురువారం సీతారామ కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పారువేట కార్యక్రమంలో భాగంగా సీతారాముల గ్రామోత్సవం నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు.

కలుగోళ్ల శాంభవికి లక్ష మల్లెల పూజ



లక్ష మల్లెల పూజ నిర్వహిస్తున్న మహిళలు

కావలి, మే 23: కావలి పట్టణం కలుగోళ్ల శాంభవి ఆలయంలో వైశాఖ పౌర్ణమిని పురస్కరించకుని గురువారం ఉదయం లక్ష మల్లెల పూజ 108 మంది ముత్తైదువులచే వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కలుగోళ్ల శాంభవి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ గావించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ నిర్వాహకుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

కావలి రూరల్, మే 23: జలదంకి మండలం లింగరాజు అగ్రహారానికి చెందిన విద్యార్థిని అదృశ్యంపై గురువారం రాత్రి ఆమె తండ్రి రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని ఒక ప్రయివేటు కళాశాలలో డిగ్రీ మెదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పట్టణంలోని జేబి కళాశాలలో పరీక్షలు రాయటానికి బుధవారం వచ్చినట్లు తెలిపారు. పరీక్ష అనంతరం పరీక్షా కేంద్రం నుండి స్నేహితులతో కలసి వచ్చిన విద్యార్థిని వెంగళరావు నగర్‌లోని తన అత్త ఇంటివద్ద ఉన్న చెల్లిని తీసుకువస్తానని తండ్రికి ఫోన్‌చేసి చెప్పినట్లు తెలిపారు. అనంతరం కొద్దిసేపటి తరువాత ఆమె అత్త ఫోన్ చెయ్యగా ఇంటికి వచ్చేందుకు ఆటో కోసం చూస్తున్నానని అత్తకు చెప్పిందన్నారు. తరువాత ఎంత సేపటికీ ఇంటికి రాకపోగా ఫోన్ చెయ్యగా స్విచ్ఆఫ్ రావటంతో బంధువుల ఇళ్లవద్ద, అక్కడక్కడ వెతికినా కనిపించక పోవటంతో విద్యార్థిని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సిఐ శ్రీనివాసరావు తెలిపారు.

టీఆర్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఓరుగంటి వెంకటేశ్వరరావు

కందుకూరు, మే 23: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఓరుగంటి వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన నాగేశ్వరరావు ఇటీవల ఉద్యోగ విరమణ చేయడంతో ఇక్కడ పౌరశాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావును పూర్తి అదనపు బాధ్యతలతో ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. దీంతో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కళాశాలలో విద్యాప్రమాణాల మెరుగుకు కృషిచేస్తానన్నారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- మాతినవారిపాలెంలో వైద్యశిబిరం ఏర్పాటు

కావలి రూరల్, మే 23: కావలి మండలం సర్వాయపాలెం పంచాయతీ మాతినవారి పాలెంలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టి నట్లు జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత పేర్కొన్నారు. మాతినవారిపాలెం గ్రామ పరిసరాలు, నీటి వనరులను, ఓవర్‌హెడ్ ట్యాంకును గురువారం డీపీవో పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడబడితే అక్కడ చెత్త వెయ్యరాదని, బహిరంగ మలవిసర్జన మాని మరుగుదొడ్లను వాడుకోవాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకు పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులకు సూచించారు. నీటి పరీక్షల నమూనాలు పరిశీలించి నీటితో ఇబ్బందులు లేవని పేర్కొన్నారు.



వాటర్ ట్యాంక్ పరిసరాలు పరిశీలిస్తున్న డీపీవో

వైద్యశిబిరాన్ని పరిశీలించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

మాతినవారిపాలెం పాఠశాలలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని డిప్యూటీ డిఎంహెచ్‌వో బ్రిజిత పరిశీలించారు. వాంతులు, విరోచనాలతో బాధపడుతున్న వారికి వైద్యసేవలు అందించి రక్తనమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటేశ్వర్లు, జేఈ క్రిష్ణచైతన్య, ఎంపీడీవో క్రిష్ణమోహన్, వైద్యులు ప్రమోద్, సర్వాయపాలెం పిహెచ్‌సీ వైద్యులు మాధురి, ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సృష్టించొద్దు : డీఎస్పీ

కావలి, మే 23: ఎన్నికల కౌంటింగ్ వేళ సమస్యలు సృష్టించి కేసులలో ఇరుక్కోవద్దని కావలి ఆర్డీవో శీనానాయక్, డీఎస్పీ ఎం వెంకటరమణ మత్స్యకారులకు సూచించారు. కావలి రూరల్ మండలం తుమ్మలపెంటలో గురువారం మత్స్యకారులతో రెవెన్యూ, పోలీస్ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో సమస్యలు సృష్టించి కేసులలో ఇరుక్కుంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రూరల్ మండలంలో తుమ్మలపెంట ప్రధానమైన గ్రామమని, ఇక్కడ ప్రశాంతతకు భంగం కలిగించకుండా చూడాలన్నారు. పోలింగ్ సమయంలో తాము స్పెషల్‌పార్టీ పోలీసులను పంపి ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఇక్కడ గొడవలు జరిగాయని, దీంతో కేసులు పెట్టాల్సి వచ్చిందన్నారు. కౌంటింగ్ సందర్భంగా కాని, కౌంటింగ్ అనంతరం కాని ఎలాంటి ప్రదర్శనలు, ఊరేగింపులకు అనుమతులు లేవని, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందని, కౌంటింగ్ రోజు 144 సెక్షన్ కూడా అలవుతుందని, అతిక్రమిస్తే కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు తీసు కుంటామన్నారు. ఇప్పటికే తాము ఎలాంటి అల్లర్లకు పాల్పడమని మీ వద్ద బైండోవర్ రాయించుకున్నామని, దానిని అతిక్రమిస్తే బైండోవర్ మేరకు మీరు పెనాల్టీ చెల్లించాల్సి వస్తోందని, లేదంటే మీ ఆస్తులు వేలం వేసి అయినా వసూలు చేస్తామన్నారు. కనుక గొడవలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కావలి తహసీల్దార్ నగేష్, రూరల్ సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కావలి ఆర్డీవో శీనానాయక్, డీఎస్పీ

టీబీ నివారణకు టీకాలు

ఉలవపాడు, మే 23 : టీబీ వ్యాధి నివారణకు ముందస్తు చర్యల్లో భాగంగా అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 8 సచివాలయాల్లో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రియంవధ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. టీబీ వ్యాధి సోకకుండా దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన 16 సంత్సరాలు దాటినవారు ఈ టీకా తప్పకుండా వేయించు కోవా లని తెలిపారు. ప్రతి గురువారం ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో టీకా వేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కరేడు వైద్యాధికారిణి డాక్టర్ రమ్య జ్యోతి, ఎంపీహెచ్‌వో లక్ష్మీనారాయణ, ఎన్ఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

అల్లూరు, మే 23 : అల్లూరు నగర పంచాయతీ పాలన అస్తవ్యస్తంగా తయారైందని, గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అల్లూరు పట్టణ పరిధితోపాటు మజరా గ్రామాల్లో వీధిలైట్లు లేక రాత్రి సమయాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీధుల్లో సిమెంటు రోడ్లను పగలగొట్టి గుంతలను ఏర్పాటు చేశారని, ఆ గుంతలను పూడ్చకుండా అలానే వదిలేయడంతో పలువురు వాహనచోదకులు గాయాలపాలవుతున్నారన్నారు. పాతబస్టాండు కూడలిలో, రాయాజి వీధిలో ఇదే పరిస్థితి ఏర్పడిందని, అదేవిధంగా ఎక్కడి చెత్త అక్కడే రోజుల తరబడి ఉండడంతో దుర్వాసన వెదజల్లుతూ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. స్పందనలో ఫిర్యాదు చేస్తే మూడు రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని తెలిపినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి

కొండాపురం, మే 23: అతిగా మద్యంసేవించి వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం మండలంలోని కొమ్మి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు గ్రామానికి చెందిన బండ్లమూడి ఏడుకొండలు (40) మద్యం తాగి మత్తులో పొలాలకు వెళ్లాడన్నారు. లింగసముద్రం మండలం ముత్తంవారిపాలెం అటవీప్రాంతంలో ఏడుకొండలు పడివుండగా పశువుల కాపరులు గమనించి దగ్గరకు వెళ్లగా అప్పటికే మృతిచెంది ఉండటాన్ని గుర్తించి కుటుంబసభ్యులకు తెలియచేయడంతో మృతదేహాన్ని ఇంటికి తీసువెళ్లారు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఈవిషయంపై ఎస్ఐ మహేంద్రను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

తీరని దాహం!



బుచ్చిరెడ్డిపాళెం, మే 23: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని ప్రధాన కూడళ్లలో నిత్యం బస్సులు, ఆటోల కోసం వేచి వుండే వేలాది మంది ప్రయాణికులకు ఉచితంగా గుక్కెడు నీళ్లిచ్చి దాహం తీర్చేందుకు అధికారులు, పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ సమస్యతో కుటుంబాలతో వచ్చే వారు దాహం తీర్చుకోవాలంటే కనీసం తాగునీటికే 100రూపాయలు ఖర్చుపెట్టి వాటర్ బాటిళ్లు కొనుక్కోవాల్సిన పరిస్థితి ఉంది. వాటర్‌బాటిల్ కూడా కొని తాగలేని ప్రయాణికులు పడే తంటాలు అంతా ఇంతా కాదు. బుచ్చి బస్టాండ్ కూడలిలో ప్రయాణికులు తాగేందుకు కనీసం ఓ కుళాయి.. ఉచితంగా తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేయలేదు. నిత్యం బుచ్చికి చిరు వ్యాపారుల దగ్గర్నుంచి బడా వ్యాపారులు, ఉద్యోగాలు, కూలీలు, బేల్దారి కూలీలు, నెల్లూరు, సంగం, ఆత్మకూరు, దగదర్తి మార్గాలలో ప్రయాణాలు సాగించే వారితో బస్టాండ్ కూడళ్లు ఉదయం నుంచి రాత్రి వరకు కిటకిటలాడుతాయి. ఎంతోమంది చిన్నారులు, వృద్ధులు, రోగులతో వచ్చే ప్రయాణికులు మండుటెండల్లో డబ్బులు పెట్టి కొనుక్కోలేక ఉచిత తాగునీరు లేక గొంతెంబెట్టుకోవాల్సిందే. బస్టాండ్‌లోని ఓ కూడలిలో పోలీసులు ఏర్పాటు చేసిన చలివేంద్రం నిన్న మొన్నటి వరకు కొంతమంది ప్రయాణికుల దాహం తీర్చింది. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు స్పందించి ప్రధాన రెండు కూడళ్లలో తాగునీటి వసతి కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇంత పెద్ద బస్టాండ్‌లో తాగునీటికి కరువు

బుచ్చి నుంచి ఇతర ప్రాంతాలకు.. వేరే ఊర్ల నుంచి బుచ్చికి వచ్చేవారు నిత్యం వేలల్లో ఉంటారు. ఇలాంటి వారికి దాహం వేస్తే బస్టాండ్ సెంటర్లో ఉచిత తాగునీరు కరువైంది. చేసేదిలేక అందరూ వాటర్ బాటిళ్ల నీరు తాగుతున్నారు. ఎంతో మంది చిన్న పిల్లలు, వృద్ధులు, రోగులతో వచ్చేవారు వాటర్‌బాటిళ్లు కొని తాగలేరు. కనీసం రెండు చోట్లైనా ఉచిత తాగునీటి వసతి కల్పిస్తే బాగుంటుంది. - విమలమ్మ, కాగులపాడు.

బస్సుల కోసం..

ప్రయాణికులకు బస్టాండ్ సెంటర్లో కనీసం తాగునీటి సౌకర్యం లేదు. బుచ్చి నుంచి ఇటు నెల్లూరు, అటు ఆత్మకూరు దాకా మధ్యలో చుక్క మంచినీరు కూడా దొరకవు. ఎండలు తగ్గేదాకానైనా ఉచిత తాగునీరు సరఫరా చేస్తే బాగుంటుంది. - ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు

డొంక పోరంబోకు భూమి ఆక్రమణ

- రెవెన్యూ అధికారులకు రైతుల ఫిర్యాదు
- సర్వేకు ఆదేశించిన అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, మే 23: మండలంలోని చెల్లాయపాళెం గ్రామంలో సుమారు రూ.26 లక్షల విలువ చేసే అరెకరా (50సెంట్లు) డొంక పోరంబోకు ఆక్రమణకు గురికావడంపై పలువురు రైతులు రెవెన్యూ అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు డొంకపోరంబోకు ఆక్రమించిన పలువురు రైతులను వారించి సర్వేకి ఆదేశించినట్టు గ్రామ రెవెన్యూ అధికారి నారాయణ తెలిపారు. రీసర్వేలో చెల్లాయపాళెంలోని సర్వే నెంబరు 715 ఎల్‌పీఎంలోని డొంకపోరంబోకును సర్వేచేసి హద్దురాళ్ళు వేసినట్టు వీఆర్వో తెలిపారు. అయినా డొంక పోరంబోకుకు చుట్టుపక్కల రైతులు మధ్య వివాదాల నేపథ్యంలో ఆక్రమణలపై పరిశీలించి సర్వేకి ఆదేశించినట్టు వీఆర్వో తెలిపారు. రెండు రోజుల్లో సర్వేచేసి ఆక్రమణలు తొలగించి పటిష్టంగా హద్దురాళ్లు ఏర్పాటు చేస్తామని వీఆర్వో తెలిపారు.



చెల్లాయపాళెంలో ఆక్రమణలతో వివాదాస్పదమైన డొంక పోరంబోకు భూమి

అద్దె తక్కువే.. కానీ అధ్వానం!



అంబేడ్కర్ భవన్‌లో పెచ్చులూడిపోతున్న శ్లాబు

- నిర్వహణలేమితో అంబేడ్కర్ భవనం
- పెచ్చులూడిన శ్లాబు... వసతుల కరువు

నెల్లూరు (వీఆర్సీ), మే 23 : నగరం నడిబొడ్డున ఉన్న భారతరత్న అంబేడ్కర్ భవనం అధ్వానంగా ఉంది. ఈ భవనంలో శుభకార్యాలు, ప్రభుత్వ అధికారుల సమావేశాలు నిర్వహిస్తుంటారు. వివిధ దళిత సంఘాలు ఇక్కడే సమావేశం అవతుంటాయి. అయినా, దీని ఆలనా పాలనను ఎవరూ పట్టించుకోవడం లేదు. భవనం స్లాబు పెచ్చులూడిపోతోంది. చిన్నపాటి మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదు. ఇక్కడ కార్యక్రమాలు చేసుకోవడానికి ఎస్సీలకు రూ.2000, నాన్ ఎస్సీలకు రూ.5వేలు రోజువారీ అద్దె వసూలు చేస్తారు. నగరంలో ఇంతటి చౌకగా ఫంక్షన్ హాలు లభించడం విశేషం. అయితే భవనానికి మరమ్మతులు చేయించి, సరైన వసతులు కల్పించడం తోపాటు రంగులు వేయిస్తే చూపరులను ఆకర్షించడం తోపాటు ఆదాయం పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి.



గ్రంథాలయంలో ఉన్న పాత పుస్తకాలు

గ్రంథాలయాన్నీ పట్టించుకోండి!

అంబేడ్కర్ భవనం లోపలే గ్రంథాలయం ఉంది. దీని బాగోగులు కూడా ఎవరూ పట్టించుకోవడం లేదు. నేటి పరిస్థితులకనుగుణంగా పాఠకులకు అవసరమైన పుస్తకాలు లేకపోవడంతో సందర్శకులు నానాటికీ తగ్గిపోతున్నారు. ఇక్కడ దినపత్రికలు మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు. అధిక భాగం పాత పుస్తకాలే!. అంబేడ్కర్, ఇతర దేశ నేతల జీవిత చరిత్ర, విజ్ఞాన సంబంధ పుస్తకాలను అందుబాటులో ఉంచితే సందర్శకులు పెరిగే అవకాశం ఉంది.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..!

- జోరందుకున్న పందేలు

ముత్తుకూరు, మే 22: జిల్లాలోని సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై అ త్యంత ఉత్కంఠత రేపుతున్న నియోజకవర్గాల్లో సర్వేపల్లి ఒకటి. ఈ నియో జకవర్గ టీడీపీ అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వైసీపీ అభ్యర్థిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రధానంగా పోటీలో ఉన్నారు. గతంలో ఎమ్మెల్యేగా మంత్రిగా తాను చేసిన అభివృద్ధితో పాటు అనంతరం ఓడినా ప్రజల్లో ఉంటూ వారి సమస్యల కోసం తాను చేసిన పోరాటమే గెలిపిస్తుందని సోమిరెడ్డి ధీమాను వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం పేదలకు అందించిన సంక్షేమ పథకాలు నియోకవర్గంలో అందరికీ అందించామని, అభివృద్ధికి తీసుకున్న చర్యలు తనను గెలిపిస్తాయని కాకాణి చెబుతున్నారు. గత రెండు ఎన్నికల్లో సర్వేపల్లిలో కాకాణి.. సోమిరెడ్డిపై విజయం సాధించారు. మం త్రిగా కాకాణి అక్రమాలు, అరాచకాలు, అవినీతి ప్రధాన అజెండాగా సోమి రెడ్డి ప్రచారం సాగించారు. నిరుద్యోగ సమస్య, కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టర్మినల్ మూసివేత, కాలుష్యం వంటి సమస్యలపై ప్రధానంగా దృష్టి పెట్టారు. దీంతో ముత్తుకూరు మండలంతో పాటు తోటపల్లిగూడూరు, వెంకటాచలం, మనుబోలు మండలాల్లో మంత్రి కాకాణి, వైసీపీ ప్రభుత్వం పాల నపై ఉన్న వ్యతిరేకతను ఓట్ల రూపంలో మార్చుకుని టీడీపీకి సానుకూ లంగా మారిందన్న అభిప్రాయం సోమిరెడ్డిలో వ్యక్తమవుతోంది. ఈ ఎన్నికల్లో పెరిగిన ఓటింగ్ శాతం.. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్లనే ఈ ఎన్నిక ల్లో విజయం తమకు అనుకూలమని వైసీపీ నాయకులు చెబుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత అరాచక పాలన పట్ల విసిగిన ప్రజలు పెద్ద ఎత్తున పో లింగ్‌లో పాల్గొన్నారని, ఇది టీడీపీకి శుభపరిణామమని టీడీపీ పార్టీ నా యకులు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా ఈసారి మహిళల పోలింగ్ కంటే పురుషుల పోలింగ్ శాతం ఎక్కువగా ఉండడం గమనార్హం. ముత్తు కూరు, వెంకటాచలం, టీపీగూడూరు మండలాల్లో టీడీపీకి స్పష్టమైన ఆధి క్యం లభిస్తుందని, మనుబోలులో సైతం టీడీపీకే మెజార్టీ వస్తుందని, పొద లకూరులో పోటాపోటీ నెలకొన్న విజయం తమదేనని టీడీపీ నాయకులు అంచనాలు వేస్తున్నారు. అయితే పొదలకూరులో మెజార్టీ రావడంతో పాటు మనుబోలు, టీపీగూడూరులోనూ వైసీపీ ఆధిత్యంలో ఉంటుందని తమ గెలుపు ఖాయమని వైసీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇరు వర్గాలు ఎవరికి మద్దతుగా వారి వాదనలు వినిపిస్తుండడంతో సర్వేపల్లి ఫలి తాలపై నియోజకవర్గ ప్రజలతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ ఆసక్తి నెలకొంది. దీంతో సర్వేపల్లి గెలుపు ఓటములపై పందేలు కాసేవారి జోరు ఊపందుకుంది. లక్షల్లో మొదలైన పందేలు రూ.కోట్లకు చేరుకు న్నా యని సమాచారం. ఈ ఉత్కంఠత తీరి సర్వేపల్లిపై విజయకేతనం ఎగరే సేది ఎవరో తెలియాలంటే మరో 11రోజులు వేచి చూడాల్సిందే.

మంత్రి హోదాలో ఉండి వ్యక్తిగత విమర్శలు తగదు

- టీడీపీ సీనియర్ నాయకులు కావల్‌రెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తోటపల్లిగూడూరు, మే 23: మంత్రి హోదాలో ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహ న్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని టీడీపీ సీనియర్ నాయకులు కావల్‌రెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. ఈ విషయంపై గురువారం ఆయన మండల కేంద్రంలో పార్టీ నాయకులతో మీడియా సమావేశంలో మాట్లాడారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం మంత్రి హోదాలో పనిచేసిన సోమిరెడ్డిని కించపరచడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఎన్నికలలో గెలుపోటములు సహజమన్నారు. సోమిరెడ్డి చేసిన వాస్తవ విమర్శలకు జవాబు చెప్పకుండా ఆయన శీలంపై బురదజల్లడం మంత్రి హోదాకు అవమానకరమన్నారు. అనంతరం మాజీ ఎంపీపీ మహిళా నేత ఇంగిలాల నిర్మలమ్మ మత్స్యకార మండల అధ్యక్షులు దండు వాసు దళిత నాయకులు చింతా సీతారామయ్యలు మాట్లాడారు. సోమిరెడ్డికి మహిళల పట్ల ఎంతో గౌరవం ఉందన్నారు. ఈ ఎన్నికల్లో సోమిరెడ్డి విజయం తథ్యమన్నారు. సమావేశంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ముత్యాలు శ్రీనివాసులు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గంగపట్నం సుధీర్‌బాబు, కంజి సాయిరాం, పామంజి దొరబాబు, భక్తాన్ని రామాంజనేయులు, పామంజి గోపి, గుడ్లూరు గోపాల్‌నాయుడు, చుక్కపల్లి మల్లికార్జున్ నాయుడు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వారంపాటు రైల్వే గేటు మూత

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు



గేటు వద్ద మరమ్మతులు చేస్తున్న ఎక్స్‌కవేటర్

వెంకటాచలం, మే 23: వెంకటాచలం నుండి సర్వేపల్లి పరిసర గ్రామాలకు వెళ్లడానికి ఏర్పాటు చేసిన రైల్వే గేటు మరమ్మతుల కారణంగా గురువారం మూసివేశారు. ఏడు రోజుల పాటు మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. రైల్వే గేటు, పట్టాలను బాగు చేసే ఈ ప్రక్రియలను ప్రారంభించామన్నారు. ఈ మార్గం మీదుగా వెళ్లే ప్రయాణికులు వేరే మార్గాల మీదుగా వెళ్లాలని సూచించారు. ఈవిషయాన్ని తప్పకుండా వాహనదారులు, ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు. కాగా జాతీయ రహదారి నుంచి ముత్తుకూరు, సర్వేపల్లి ప్రాంత ప్రజలు రాకపోకలు సాగించడానికి వెంకటాచలం రైల్వే గేటు అత్యంత కీలకమైనది. అయితే ఈ గేటు మూతతో వాహనాలు తిక్కవరప్పాడు, గొలగమూడి, కంటేపల్లి గ్రామాల మీదుగా ప్రయాణించాల్సి ఉంది. అంతేకాకుండా కిష్టపట్నం పోర్టురోడ్డుపై ప్రయాణం సాగించాల్సి ఉంటుంది. దీనివల్ల కాలంతో పాటు ఇంధన ఖర్చు కూడా పెరగనుందని ప్రయాణికులు లబోదిబోమంటున్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి గేటు మరమ్మతుల పేరుతో గేటు మూసివేస్తే రాకపోకలకు ఇబ్బందులు వస్తున్నాయని ఈ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే గేటు ఉన్న చోట ఫ్లైఓవర్ నిర్మిస్తే ఏ సమస్య ఉండదని చెబుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

ఓట్ల లెక్కింపునకు కట్టుదిట్టమైన భద్రత : ఆర్వో



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్వో వికాస్

నెల్లూరు రూరల్, మే 23 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరిగే నెల్లూరు రూరల్‌లోని కనుపర్తిపాడు వద్ద గల ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ నియమించిన ప్రత్యేక కమిటీ అధ్యక్షుడు, నగర కమిషనర్, సిటీ ఆర్వో వికాస్ మర్మత్ తెలిపారు. అనుమతి లేని వ్యక్తులకు ప్రవేశం లేదని చెప్పారు. గురువారం కమిటీ సభ్యులతో కలిసి ఆయన ప్రియదర్శిని కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాల చుట్టుపక్కల ఆంక్షలు అమల్లో ఉన్నాయన్నారు. ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగుతున్నందున కళాశాల పరిసరాల్లో అధికారుల నిఘా ఉందన్నారు. ఆ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియమ, నిబంధనలపై ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అనంతరం నగరంలోని ముత్తుకూరు కూడలి, సర్వేపల్లి కాలువ కట్ట వద్ద ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సుందరీకరణ పనులను కమిషనర్ పరిశీలించారు.

జాతీయ టెన్నిస్‌బాల్ క్రికెట్‌కు ‘బీవీఎస్’ విద్యార్థినులు



విద్యార్థినులతో హెచ్ఎం విజయజ్యోతి

నెల్లూరు (విద్య), మే 23 : జాతీయ అండర్-17 టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలకు నగరంలోని నవాబుపేట బీవీఎస్ నగర పాలక ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు బాలికలు ఎంపికయ్యారు. ఈ పోటీలు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ నెల 25 నుంచి 28వతేదీ వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పీ విజయజ్యోతి మాట్లాడుతూ మార్చి నెలలో ఒంగోలులో జరిగిన రాష్ట్ర పోటీల్లో జిల్లా బాలికల జట్టు ప్రథమ స్థానం సాధించిందని తెలిపారు. ఆ జట్టులో తమ పాఠశాలకు చెందిన జీ హేమలత (బౌలర్), పీ గాయత్రి(బ్యాట్స్‌ఉమెన్), వీ అక్షిత(బౌలర్) అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. జాతీయ పోటీల్లోనూ ఉత్తమంగా రాణించి రాష్ట్ర, జిల్లా కీర్తితోపాటు పాఠశాల కీర్తిని ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు పీ అజయ్‌కుమార్, ఎం రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

హత్యకేసులో ఆరుగురు నిందితుల అరెస్ట్

బాపట్ల,మే 23 : ఈనెల 15వ తేదీన బాపట్ల పట్టణంలో జరిగిన హత్యకు సంబంధించిన ఆరుగురు నిందితులను గురువారం బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగరానికి చెందిన ప్రశాంత్ (25) అనే యువకుడిని కొంతమంది యువకులు బాపట్ల పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద హత్య చేసి పరారు అయ్యారు. మృతుడి అక్క ధనలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా మొత్తం ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. మొదటి ముద్దాయి అయిన ఆదిపరెడ్డి కృష్ణారెడ్డికి మృతుడు ప్రశాంత్‌కు గతంలో గొడవలు ఉండటం వలన ఒకరినొకరు చంపుకోవాలనే కక్షలు ఉండటంతో నిందితుడు కృష్ణారెడ్డి మరో ఐదుగురితో కలిసి ఈనెల 15వ తేదీన బాపట్లలో ఉన్న ప్రశాంత్‌ను కత్తులతో పొడిచి హత్య చేసి వెళ్ళిపోయారు. మొత్తం మొదటి నిందితుడు కృష్ణారెడ్డి, మిగిలిన ఐదుగురైన ఆర్.లక్ష్మయ్య, ద్వారకా చెర్ల లక్ష్మణ్, వంగా రోహిత్, కోమరిక ఈశ్వర్‌లను అరెస్ట్ చేశామని డీఎస్పీ తెలిపారు. కేసులో హత్య చేయుటకు ఉపయోగించిన కత్తులు, నిందితులు వచ్చిన కార్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ యు.శ్రీనివాసులు, పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నమయ్య జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), మే 23 : వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యులు 616వ జయంతి సందర్భంగా గురువారం మినీబైపా‌స్‌లోని అన్నమయ్య విగ్రహానికి విశేష పూజలు జరిగాయి. శ్రీశ్రీనివాసా నాట్యమండలి కార్యదర్శి తిరుపతి హరగోపాల్, విజ్జా మస్తానయ్య, సభ్యులు అన్నమయ్య విగ్రహానికి పుష్పమాలలు వేసి పూజలు చేశారు. నగరంలోని నర్తకీ సెంటర్‌లో కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతి వేడుకలు జరిగాయి. అన్నమయ్య కీర్తి గుణగణాలను ఈ సందర్భంగా వక్తలు వివరించారు. ప్రముఖ గాయకుడు పాటూరి శ్రీనివాసులును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏ జయప్రకాష్, శింగంశెట్టి మురళి, దగ్గుబాటి రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం), మే 23 : వైశాఖ పౌర్ణమి సందర్భంగా నగరంలోని వివిధ ఆలయాల్లో గురువారం ఉత్సవాలు జరిగాయి. ప్రత్యేకంగా పలుచోట్ల సత్యనారాయణ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ● మహాత్మాగాంధీనగర్ శ్రీకృష్ణమందిరంలో రమాసమేత వీరవెంకట సత్యనారాయణ స్వామి వ్రతం సామూహికంగా జరిగింది. ఉదయం విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● పప్పులవీధి సిద్ధి విఘ్నేశ్వరాలయంలో గణపతికి మామిడి పండ్ల రసార్చన జరిగింది. భక్తులు మామిడి పండ్ల రసాన్ని సమర్పించి అభిషేకంలో పాల్గొన్నారు. అర్చకుడు మాచవోలు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. అనంతరం పూలంగిసేవ, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పాండురంగ అన్నదాన సమాజం పాలక వర్గం, సిద్ధి విఘ్నేశ్వరాలయం పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు.

● వైభవంగా సహస్ర ఘటాభిషేకం

వైశాఖ పౌర్ణమి సందర్భంగా పప్పులవీధి ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో 1008 (సహస్ర) కళాశాలతో ఘటాభిషేకం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి విశేషార్చన, పూలంగిసేవ, ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగాయి. అన్నమయ్య 616వ జయంతి సందర్భంగా సాయంత్రం ఆలయంలో గుండాల గురవయ్య, ఆయన శిష్య భజన మండళ్ల ద్వారా అన్నమాచార్య సంకీర్తనల భజనలు, కీర్తనల గానం జరిగాయి. భక్తులతో ఆలయం కళకళలాడింది.

కొనసాగుతున్న కార్డన్ సెర్చ్

నెల్లూరు(క్రైం), మే 23: శాంతి భద్రతల పరిరక్షణ, చట్ట వ్యతిరేక శక్తుల అణచివేత, దొంగతనాల నివారణ, అసాంఘిక శక్తుల ఏరివేతే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు నిర్వహిస్తున్న కార్డన్ సెర్చ్ ఆపరేషన్ గురువారం కొనసాగింది. నెల్లూరులోని సంతపేట, జలదంకి, ఉదయగిరి, దుత్తలూరు, కందుకూరు రూరల్, టీపీ గూడూరు, కలిగిరి, ఎస్‌ఆర్ పురం, కొడవలూరు, వింజమూరు స్టేషన్ల పరిధిలోని పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీ లు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 34 బైక్‌లు, 3 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు.

రేపు జాగృతి సదస్సు

నెల్లూరు (సాంస్కృతికం), మే 23 : సృజన సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5గంటలకు హిందూ ధర్మాన్ని కాపాడుకుందామనే పేరుతో జాగృతి సదస్సు జరుగుతుందని నిర్వాహకుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం జూనియర్ రేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారక భవనంలో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రజ్ఞానం కలిగిన వారి ప్రసంగాలు, ప్రతిభ సేవామూర్తులకు సత్కారం, పేదలకు వస్త్రదానం, వర్ధమాన గాయనీ గాయకులతో భక్తి గీతాలాపన జరుగుతాయని, అందరూ పాల్గొనాలని కోరారు.

భూసారం పెరిగితేనే దిగుబడి : ఏడీఏ

నెల్లూరు రూరల్, మే 23 : సేద్యంలో దిగుబడులు రావాలంటే భూమిలో సారం పెరగాలని నెల్లూరు వ్యవసాయ శాఖ ఏడీ ఎన్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. గురువారం మండలంలోని కలివెలపాళెం, వావిలేటిపాడు ప్రాంతాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడున్న పరిస్థితుల్లో భూమి సారం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు అవగాహన లేమితో పోటీపడి రసాయన ఎరువులు మితిమీరి వాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వాటి వల్ల భూమి సహజత్వాన్ని కోల్పోతుందని చెప్పారు. ఫలితంగా దిగుబడులు తగ్గడంతోపాటు తెగుళ్ల ఆశిస్తాయని, పైర్లకు మేలు చేసే సూక్ష్మజీవులు నశిస్తాయని తెలిపారు. భూసారం పెంపుదలకు వ్యవసాయ శాఖ 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట ఎరువులను అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగమోహన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్రిమూర్తులకంటే గురువే గొప్ప

నెల్లూరు (సాంస్కృతికం), మే 23 : త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు ఒక్కొక్కరికి ఒక్క స్థితి మాత్రమే ఉంది, కానీ గురువుకు ఆ ముగ్గురికి గల సృష్టి, స్థితి, లయలు ఉన్నాయని ఓరుగంటి శ్రీరామలాలశర్మ తెలిపారు. గురువారం పొగతోట ఆదిశంకర ధ్యానమందిరంలో ఆదిశంకరాచార్యులు కంచికామకోటి ప్రతిష్ఠాపన దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా గురువుపై వేదాంతపరంగా ఆయన విశ్లేషించారు. గురువు శిష్యులను తయారు చేయగలడు, వారిని ఉత్తములుగా తీర్చిదిద్దేది ఒక్క గురువేనంటూ గురువు మహాత్మ్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఉదయం విశేష పూజలు జరిగాయి.

కమనీయం కాశీవిశ్వనాథుడి కల్యాణం

నెల్లూరు (సాంస్కృతికం), మే 23 : ఉస్మాన్‌సాహెబ్ పేటలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథ ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉభయకర్తలుగా ప్రముఖ ఆడిటర్ ఎస్వీ రాఘవేంద్రరావు కుటుంబం వ్యవహరించింది. ఉదయం విశేష పూజలు, రుద్రాభిషేకాలు జరిగాయి. పూలంగిసేవ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని ఉభయకర్తలు, ధర్మకర్తలు, ఈవో దుర్గయ్య పర్యవేక్షించారు.

బంగారు రుణాలపై అవగాహన ర్యాలీ

నెల్లూరు (సాంస్కృతికం), మే 23 : రైతులు, వ్యాపారులకు బంగారు రుణాలపై అవగాహన కల్పించేందుకు గురువారం నగరంలో కెనరా బ్యాంకు ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఏకే నగర్ నుంచి కెనరా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం వరకు అధికారులు, ఉద్యోగులు, గోల్డు అప్రైజర్లు కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ప్రజలకు బంగారు రుణ ప్రయోజనాలు, కెనరా బ్యాంకు సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం నాగరాజు, డివిజనల్ మేనేజర్ వీ అశోక్, మణిశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), మే 23 : సమాజానికి దశ దిశ నిర్దేశించి ప్రేమతత్వాన్ని, అహింసను బోధించిన మహోన్నత వ్యక్తి గౌతమ బుద్ధుడని గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అరవ రాయప్ప అన్నారు. బుద్ధ జయంతి సందర్భంగా గురువారం స్థానిక స్వతంత్ర పార్కులో ఆ వాకర్స్ అసోసియేషన్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. రాయప్ప మాట్లాడుతూ గౌతముడి బోధనలు, సిద్ధాంతాలను యువత పాటించాలని కోరారు. బుద్ధుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేవీ రమణయ్య, జయప్రకాష్, సింగంశెట్టి మురళీ మోహన్‌రావు, రాచపాలెం రఘు, కేత సుబ్బారావు, డాక్టర్ రమణయ్య, డాక్టర్ సుబ్బారెడ్డి, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

భూసారం పెంపుపై రైతులకు అవగాహన

మనుబోలు, మే 23: భూసారం ఎలా పెంచుకోవాలో వ్యవసాయాధికారి జహీర్ గురువారం రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని వీరంపల్లి, అక్కంపేట రైతుభరోసా కేంద్రాలలో రైతులను సమావేశపరిచారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రసాయన ఎరువులు తగ్గించాలన్నారు. సేంద్రియ, జీవన ఎరువులు, పశువుల పేడ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తే భూసారం పెరుగుతుందన్నారు. అంతేగాకుండా జనుము, జీలగ, పిల్లపెసర లాంటి పచ్చిరొట్ట పైర్లు లేతదశలో ఉన్నప్పుడే భూమిలో కలిపి దున్నేయాలన్నారు. తద్వారా భూమిలో కర్బనశాతం పెరిగి సూక్ష్మపోషకాలు తయారవుతాయన్నారు. దీంతో నేలలో తేమశాతం పెరిగితే భూమి సారవంతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు శ్రీదేవి, ప్రతాప్‌లు పాల్గొన్నారు.

విశాలాక్షి అమ్మవారికి కుంకుమ పూజలు



సామూహిక కుంకుమ పూజల్లో భక్తులు

పొదలకూరు, మే 23: పౌర్ణమిని పురస్కరించుకుని తాటిపర్తి శివశక్తి క్షేత్రంలో విశ్వేశ్వర సమేత విశాలాక్షి అమ్మవారికి గురువారం భక్తులు శాస్త్రోక్తంగా అర్చకులు ఉయ్యాల వేణు చేతుల మీదుగా లలితా సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. ఈ కుంకు మార్చనలో అధిక సంఖ్యలో మహిళలు భక్తులు పాల్గొన్నారు. పూజల అనంతరం అమ్మ వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం శివశక్తి క్షేత్రంలో భక్తులకు అన్నదానం చేశారు. ఉభయకర్తలుగా చిన్నయరెడ్డి, లక్ష్మీ దంపతులు వ్యవహరించారు.

వేటలేక మత్స్యకారుల ఇబ్బందులు

- అమలుకాని మత్స్యకార భరోసా



వేట నిషేధించడంతో సముద్రం ఒడ్డున ఉన్న బోట్లు

ఇందుకూరుపేట, మే 23: చేపల వేట నిషేధించి రోజులు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం మత్స్యకార భరోసాను అమలుచేయకపోవడంతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. చేపలు గుడ్లు పెట్టే సమయం కావడంతో గత నెల 15వ తేదీ నుంచి వేటకు వెళ్లరాదని మత్స్యకారులను ప్రభుత్వం ఆదేశిం చింది. వేటకు వెళ్లే ప్రతి మత్స్యకా రుడికి వారి ఖాతాలో మత్స్యకార భరోసా పేరుతో రూ.10వేలు జమ చేసేది. ఈసారి ఎన్నికల్ కోడ్ ఉండడంతో ప్రభుత్వం దీనిపై దృష్టి సారించలేదు. దీంతో ఎలా జీవనం సాగించాలో తెలియడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. మండలంలో 1100 మంది మత్స్యకారులకు మత్స్యకార భరోసా కోసం గుర్తింపు ఉంది. మండలంలోని మైపాడు, కృష్ణాపురం, గంగపట్నం, పల్లెపాలెం, ఇతర గ్రామాలలో సుమారు 1100 కుటుంబాలు చేపల వేటే ఆధారంగా జీవిస్తున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

విరబూసిన మే పుష్పం



నెల్లూరు రూరల్, మే 23 : ప్రకృతివరంగా చెప్పుకునే ‘మే’ పుష్పం మండలంలోని గొల్లకందుకూరు గ్రామంలో విరబూసింది. గ్రామానికి చెందిన రైతు పొణక హరిప్రసాద్ రెడ్డి నివాసంలో ఈ పుష్పం విరిసింది. ప్రతి ఏడాది మే నెలలోనే ఇది పూస్తుందని రైతు తెలిపారు. ఈ సారి ఎండల తీవ్రత వల్ల పుష్పం పరిమాణం తగ్గిందని చెప్పారు. కాగా, మే పుష్పాన్ని గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు.



ముక్కంటి ఆలయంలో రద్దీ

శ్రీకాళహస్తి, మే 23 : శ్రీకాళహస్తీశ్వరాలయం గురువారం భక్తజన సంద్రంగా మారింది. పౌర్ణమిని పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 27వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 6457మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 1,667మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 1,850మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 488మంది, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 197మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 148మంది, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 50మంది భక్తులు పూజలుచేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 15,049అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కమనీయం.... నృసింహుడి కల్యాణం

డక్కిలి, మే 23 : వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని పెంచలకోనలో గురువారం ఉదయం చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి సమేత పెంచల స్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. స్వామి వారికి ఆలయ అధికారులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. స్వామివారి కల్యాణం సందర్భంగా పలు జంటలు వివాహంతో ఒక్కటయ్యాయి. అనంతరం అర్చకులు చేపట్టిన ఎదుర్కోలు ఉత్సవం భక్తులను ఆకట్టుకుంది. గురువారం రాత్రి దేవేరులతో కలిసి పెంచలస్వామి రథంపై భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయం నుంచి కోన ముఖ ద్వారం వరకు భక్తులు రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు.ఏసీ డి.వెంకటేశ్వర్లు, డీసీ కె.విజయసాగర్ సాగరబాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ హరీష్, ఆలయ ప్రధాన అర్చకులు రామయ్య స్వామి, శశికుమార్ స్వామి, గుండ్లూరు సీతారామయ్య, పెంచలయ్య, బాలాజి, మధు స్వామితో పాటు టీటీడీ అర్చకులు పాల్గొన్నారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8.30 గంటలకు వసంతోత్సవం, చక్ర స్నానం, రాత్రి 7 గంటలకు తెప్పోత్సవం,10 గంటలకు అశ్వవాహన సేవ, రాత్రి 11.30 గంటలకు ధ్వజావరోహణ కార్యక్రమాలు జరుగుతాయి.



కల్యాణోత్సవం



తిరుమల కిటకిట

తిరుమలలో మళ్లీ భక్తుల రద్దీ పెరిగింది. శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, అఖిలాండం, లడ్డూకౌంటర్, అన్నప్రసాద భవనం, లేపాక్షి సర్కిల్ ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.గదుల కోసం సీఆర్వో, ఎంబీసీ, పద్మావతి, టీబీ, ఏఆర్పీ కౌంటర్ల వద్ద భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు కూడా భక్తులతో నిండిపోయాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

గెలుపుపై నమ్మకాలు
ఆధిక్యతపై అంచనాలు

ఎన్నికల ఫలితాలపై
ఎవరి ధీమా వారిదే!



ఈవీఎం పెట్టెల్లో దాగిన విజయ రహస్యం జూన్ 4న కానీ బట్టబయలు కాదు. ఇంత సుదీర్ఘకాలం ఎదురు చూడాల్సిరావడం రాజకీయ నాయకులకు హింసగా ఉంది. దీంతో పోలింగ్ తీరును విశ్లేషించుకుంటూ గెలుపు ఓటముల అంచనాల్లో మునిగి తేలుతున్నారు. తమ విజయానికి దారితీసే అంశాలనూ, ఎదుటి పక్షం బలం తగ్గిన కారణాలనూ చర్చించుకుంటున్నారు.జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఉభయపార్టీల్లో నడుస్తున్న అంచనాల తీరు ఇలా ఉంది.

వెంకటగిరి

ఉభయుల్లో ఒకే ధీమా

వెంకటగిరి నియోజకవర్గంలో తమ విజయం ఖాయమని టీడీపీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.ఎక్కడా ప్రత్యర్థికి తగ్గకుండా ఎన్నికల్లో ఢీకొన్న కారణంగా విజయావకాశాలను దెబ్బతీసే పరిస్థితులేవీ లేవని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. గెలుపు తమదేనని, కనీసం 15 వేల ఓట్ల మెజారిటీతో గెలుస్తామని నమ్మకంగా చెబుతున్నాయి. అదే సమయంలో వైసీపీ వర్గాల అంచనాలు భారీగా వుంటున్నాయి. ఆర్థిక వనరులు పుష్కలంగా వినియోగించామని, అభ్యర్థి జిల్లా వైసీపీ అధ్యక్షుడు కనుక జిల్లాలో తమకే అత్యధిక మెజారిటీ వస్తుందన్న ధీమా వారిలో వ్యక్తమవుతోంది.

గూడూరు

గట్టెక్కుతామంటున్న వైసీపీ

గూడూరులో టీడీపీ సూపర్ సిక్స్ హామీలు ప్రభావం చూపాయని, వాటి పట్ల మహిళలు అధికంగా ఆకర్షితులు కావడం వల్లే వారి పోలింగ్ శాతం పెరిగిందని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. మెజారిటీ మహిళల ఓట్లన్నీ తమకే పడ్డాయన్నది వారి భావన. గెలుపు తమదేనని, హీనపక్షం 5 వేల ఓట్ల మెజారిటీతో అయినా గెలుస్తామని నమ్మకంగా చెబుతున్నారు. ఇక వైసీపీ విషయానికొస్తే గత ఎన్నికల్లో 45 వేల ఆధిక్యత వచ్చిందని, అందులో ఎంత కోత పడినా మహిళల మద్దతుతో కనీసం 10 వేల మెజారిటీతో గెలుస్తామని అంచనా వేస్తున్నారు.

శ్రీకాళహస్తి

టీడీపీలో విజయోత్సాహం

శ్రీకాళహస్తిలో వైసీపీ వర్గీయుల అంచనా భారీగా తగ్గిపోయింది. పెద్దఎత్తున ఆర్థిక వనరులు వినియోగించినా అవేవీ ఫలితాలపై ప్రభావం చూపించే అవకాశం లేకపోవడంతో ఎలాగోలా 2 వేల నుంచీ 5 వేల వరకూ ఆధిక్యత సాధిస్తామని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో టీడీపీ వర్గీయులు మాత్రం విజయంపై భారీ అంచనాలు వేస్తున్నారు. అధమపక్షం 10 వేల నుంచీ 15 వేల మెజారిటీతో గెలుస్తామన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు.

సూళ్లూరుపేట

గెలుపు ఆశతో వైసీపీ

సూళ్లూరుపేటలో అధికార పార్టీ వర్గాలు తమకు దొరవారిసత్రం మండలంలో భారీ మెజారిటీ వస్తుందని, దానివల్ల సూళ్లూరుపేట, తడ మండలాల్లో టీడీపీ సాధించే మెజారిటీని అధిగమించి 3 వేల నుంచీ 5 వేల మెజారిటీతో గట్టెక్కుతామని భావిస్తున్నాయి. అదే సమయంలో టీడీపీ వర్గీయులు నాయుడుపేట, సూళ్లూరుపేట, తడ మండలాల నుంచీ భారీ మెజారిటీ అంచనా వేస్తున్నారు. దీనివల్ల కనీసం ఐదారు వేల మెజారిటీతో విజయం సాధిస్తామన్న విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

సత్యవేడు

స్థానికతదే విజయం అంటున్న టీడీపీ

సత్యవేడులో స్థానిక అభ్యర్థి అన్న అంశం బాగా అనుకూలించిందని టీడీపీ వర్గాలు నమ్ముతున్నాయి. దానికి తోడు మహిళల ఓట్లు అధికంగా తమకే పడ్డాయని, కనీసమంటే 5 వేల నుంచీ 10 వేల ఓట్ల ఆధిక్యతతో విజయాన్నందుకుంటామని చెబుతున్నాయి. ఇక వైసీపీ విషయానికొస్తే ఆర్థిక వనరులు బాగా ఖర్చు పెట్టడంతో పాటు మహిళల ఓట్లు తమకే అధికంగా పడ్డాయని నమ్ముతున్నారు. ఈ రెండు అంశాలూ లాభించడం వల్ల 15 వేల ఆధిక్యతతో గెలుస్తామని అంచనా వేస్తున్నారు.

చంద్రగిరి

పంపకాలపై నమ్మకంతో వైసీపీ


చంద్రగిరి నియోజకవర్గంలో ప్రభుత్వంపై వ్యతిరేకత, ఉద్యోగుల్లో వ్యతిరేకత వంటి సాధారణ అంశాలకు తోడు ఎమ్మెల్యేపై అసంతృప్తితో పలువురు టీడీపీలో చేరడం వంటి అంశాలు తమకు లాభించిందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. కనీసం 15 వేల మెజారిటీతో గెలుస్తామని అంచనా వేస్తున్నారు. ఇక వైసీపీలో గత పదేళ్ళుగా ఎమ్మెల్యే చెవిరెడ్డి వ్యక్తిగత సేవలు పనిచేస్తాయని, మహిళలు అధికంగా తమకే మద్దతు పలికారని ఆ పార్టీ వర్గాలు నమ్ముతున్నాయి. కనీసం 20 వేల మెజారిటీతో విజయం సాధిస్తామని వారు అంచనాకు వస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి

అభివృద్ధిపై ఆశ పెట్టుకున్న వైసీపీ

తిరుపతిలో జనసేన కూటమి వర్గాలు విజయం తమదేనని ఢంకా భజాయించి మరీ చెబుతున్నాయి. ప్రభుత్వంపై వ్యతిరేకతకు మించి ఆ పార్టీ నాయకులపై స్థానిక ప్రజల్లో వ్యతిరేకత నెలకొందని అంచనాకు వస్తున్నాయి. 20వేల మెజారిటీతో గెలుస్తామని టీడీపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అధికార పార్టీ విషయానికొస్తే నగరాన్ని అభివృద్ధి చేశామని, కొత్త రోడ్లు వేయడంతో పాటు రోడ్ల విస్తరణ వంటివి ప్రభావం చూపిస్తాయని ఆ పార్టీ వర్గీయులు నమ్ముతున్నారు. స్వల్ప మెజారిటీతో అయినా గెలుపు తీరాన్ని అందుకుంటామని అంచనా వేస్తున్నారు.



నిఘా నీడలో
మహిళా వర్సిటీ

- 500 మీటర్ల వరకు నో వెహికల్ జోన్
- అన్ని వైపులా రోడ్లు దిగ్బంధం

తిరుపతి(నేరవిభాగం), మే 23 : వచ్చే నెల 4వ తేది కౌంటింగు జరగనున్న మహిళా వర్సిటీ వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. టీడీపీ చంద్రగిరి అభ్యర్థి పులివర్తి నానీపై హత్యాయత్నం జరిగిన తర్వాత పోలీసు యంత్రాంగం పూర్తిగా అప్రమత్తమైంది.వర్సిటీకి 500 మీటర్ల పరిధిలో చుట్టు పక్కల రోడ్లు నో వెహికల్ జోన్‌గా వుంచారు. అన్ని ప్రాంతాల్లో పోలీసు బలగాలను ఏర్పాటు చేసారు. వర్సిటీ లోపలికి వెళ్ళే రెండు ప్రధాన గేట్ల వద్ద కేంద్ర బలగాలతో పాటు తిరుపతి శాంతి భద్రతల పోలీసులను నియమించారు. వీరు కాకుండా కేంద్ర బలగాలు 24 గంటలూ గస్తీలో వుండేలా పికెట్లు ఏర్పాటు చేశారు. లోపలికి వెళ్ళే ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసి వివరాలను ఎంట్రీబుక్‌లో నమోదు చేస్తున్నారు.చుట్టుపక్కల దుకాణాలు మూసివేయించారు.ద్విచక్ర వాహనాలను సైతం అనుమతించడం లేదు. గాయత్రినగర్, కృష్ణానగర్‌లకు వెళ్ళే అన్ని రోడ్లు మూసివేయడంతో మహిళా వర్సిటీ ప్రాంగణం కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తోంది.



మహిళా వర్సిటీ రోడ్డులో మూతబడ్డ షాపులు

విక్టరీ బార్ నుంచే నానీపై దాడికి పథక రచన

తిరుపతి(నేరవిభాగం), మే 23 : తిరుపతిలోని మహిళా వర్సిటీ వద్ద చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన హత్యాయత్నం ఘటనకు సమీపంలోని విక్టరీ బార్ నుంచే పథక రచన చేసినట్లు పోలీసుల దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. బార్‌లోనే మధ్యాహ్నం ఫుల్‌గా మద్యం సేవించిన నిందితులు అక్కడేదాచి వుంచిన సమ్మెట, రాడ్లు, ఖాళీ బీరు బాటిళ్లను కారులో వేసుకొచ్చి నానీపై దాడికి ఒడిగట్టినట్లు సమాచారం. దీనిపై అక్కడ వున్న సీసీ ఫుటేజీ, అరెస్టు అయిన ముద్దాయిలిచ్చిన వాంగ్మూలాల మేరకు ఎస్వీయూనివర్సిటీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే బార్‌లో వున్న సీసీ ఫుటేజీని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఆ రోజు ఎవరెవరు అక్కడకు వచ్చారు..వారికి ఆతిథ్యం ఇచ్చిన వారెవరనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నారు.నానీపై హత్యాయత్నం కేసులో అరెస్టయి కడప జైల్లో వున్న 13మందిలో తిరుమలకు చెందిన హరి, సుధాకర రెడ్డి, రాములు వున్నారు. తిరుమలలో పెయింటర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులుపై దాడి కేసులో ఈ ముగ్గురూ నిందితులు కావడంతో కేసు నమోదు చేసి అందరికీ 41 కింద నోటీసులు ఇచ్చినట్లు తిరుమల టూ టౌన్ సీఐ సత్యనారాయణ సిట్ అధికారులకు వివరించినట్లు తెలిసింది.నానీపై హత్యాయత్నం కేసులో మరికొంతమందిని అరెస్టు చేయడానికి పోలీసులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

ప్రశాంత కౌంటింగ్‌కు పకడ్బందీ చర్యలు

ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), మే 23: వచ్చే నెల 4వ తేది జరిగే కౌంటింగు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు చేపట్టామని ఎస్పీ హర్షవర్ధన రాజు చెప్పారు.తిరుపతిలోని పోలీసు పెరేడ్ గ్రౌండులో గురువారం మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఇప్పటికే 135 ప్రాంతాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించి పికెట్లు ఏర్పాటు చేసామన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఇన్నర్ కారిడార్ వద్ద 500 మీటర్ల పరిధిలో అవుటర్ కారిడార్ వద్ద 2 కిలోమీటర్ల పరిధిలో స్పెషల్ బలగాలను మొహరిస్తున్నామన్నారు. ఎన్నికల కేసులతో సంబంధం వున్న పాత నేరస్తులను అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇస్తామని అవసరం అనుకుంటే కౌంటింగ్ రోజు పోలీసు స్టేషన్‌లో వుంచుతామన్నారు.

పోలీసు అధికారులకు నోటీసులు

కూచువారిపల్లెవాసులపై కేసులో వివరణ కోరిన ఈసీ

చంద్రగిరి, మే 23: చంద్రగిరి మండలం, కూచువారిపల్లెలో జరిగిన దాడులకు సంబంధించి ఐటీ ఉద్యోగులు, వైద్య వృత్తిలో పనిచేస్తున్న టీడీపీ సానుభూతిపరులపై అక్రమ కేసులు బనాయించారని గ్రామస్తులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కూచువారిపల్లెకు చెందిన మహేష్ హైదరాబాదులో, ఎస్.దీపిక తిరుపతిలో వైద్యులుగా పనిచేస్తున్నారు. అదేవిధంగా హైదరాబాదులో హరీష్, వంశీ, బెంగళూరులో బాలాజి, మోహన్, చెన్నైలో ముకేష్, నాగేంద్ర, ఆదర్శ్, శ్రావణి ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్నారు. పోలింగ్ రోజున ఓటు హక్కు వినియోగించుకోవడానికి గ్రామానికి వచ్చిన తమపై వైసీపీ ఫిర్యాదుతో పోలీసులు కేసులు బనాయించారని ,దానివల్ల తమ భవిష్యత్తు అంధకారమయ్యే ప్రమాదముందని ఈసీకి ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో స్పందించిన ఎన్నికల కమిషన్ ఈ కేసులపై వివరణ ఇవ్వాలని పోలీసుశాఖకు నోటీసులు జారీ చేసింది.

నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీపరీక్షలు

తిరుపతి(విద్య), మే 23 : ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి జూన్ 1వరకు జరగనున్నాయి.జిల్లాలోని 48కేంద్రాల్లో సీసీ కెమరాల నిఘాలో జరిగే ఈ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆర్ఐవో ప్రభాకర రెడ్డి తెలిపారు.ఉదయం 9నుంచి 12గంటల వరకు ప్రథమ సంవత్సర, 2.30-5.30గంటలవరకు ద్వితీయసంవత్సర పరీక్షలు జరుగుతాయని తెలిపారు.ప్రథమ ఇంటర్‌లో 15,880మంది విద్యార్థులు, ద్వితీయలో 2,632మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఆర్ఐవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ ద్వారా ఆన్‌లైన్ స్ట్రీమింగ్‌లో పరీక్షలు జరిగే విధానాన్ని పర్యవేక్షిస్తామని, అవకతవకలకు చోటులేకుండా ఈ పరీక్షలను నిర్వహిస్తామని చెప్పారు. పరీక్షల పర్యవేక్షణకు 2ఫ్లైయింగ్, 4సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించామని వివరించారు.

ఇండస్ట్రియల్ కారిడార్‌లో రోడ్డు నిర్మాణంపై కసరత్తు

శ్రీకాళహస్తి, మే 23 : విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేయనున్న రోడ్డు భూసేకరణపై అధికారుల బృందం కసరత్తు చేసింది. తొట్టంబేడు మండలం పొయ్య వద్ద వున్న జాతీయ రహదారి నుంచి బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని పల్లమాల వద్ద తడ రహదారి వరకు ఇండస్ట్రియల్ కారిడార్ రోడ్డును 9.5కి.మీ పొడవు, 45మీటర్ల వెడల్పుతో నాలుగులేన్ల రోడ్డును నిర్మించేందుకు ఇప్పటికే సర్వే పూర్తి చేసిన అధికారులు పలువురికి పరిహారం కూడా అందజేశారు.ఈ నేపథ్యంలో గురువారం ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు, ఆర్అండ్‌బీ, సోషియల్ ఆర్ఆర్ తదితర శాఖల అధికారుల బృందం పొయ్య, గుమ్మడిగుంట, గౌడమాల గ్రామాలతో పాటు బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కొత్తపాళెం, పల్లమాల గ్రామాల వద్ద పర్యటించారు. రోడ్డు విస్తరణలో భాగంగా నష్టపోయే ఇండ్లను, పంటలను, ప్రభుత్వ ఆస్తులను పరిశీలించారు.అలాగే ఆస్తులు కోల్పోతున్న కుటుంబాల వారితో మాట్లాడారు. భూసేకరణకు సంబంధించిన సమస్యలపై అధ్యయనం చేశారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన వెంటనే ఈ ప్రాంతంలో ఇండస్రియల్ కారిడార్‌లో భాగంగా సెజ్ ఏర్పాటవుతుందని తెలిపారు.అధికారులు దేవరాజు, రాంబాబు, గిరీశ్వర్, ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మునిరత్నంనగర్‌లో కార్డన్‌సెర్చి



మునిరత్నంనగర్‌లో బైక్‌లను తనిఖీ చేస్తున్న అర్బన్ సీఐ

నాయుడుపేట టౌన్, మే 23: పట్టణంలోని మునిరత్నంనగర్‌లో నాయుడుపేట అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి కార్డన్‌సెర్చి నిర్వహించారు. గురువారం వేకువజామునే సిబ్బందితో కలసి మునిరత్నంనగర్‌కు చేరుకుని ఇళ్లవద్ద ఉన్న మోటరు సైకిళ్ల రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... ఎన్నికల లెక్కింపు నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా వివాదాలకు, ఘర్షణలకు దిగితే కఠినచర్యలు తప్పవన్నారు. యువత గంజాయి, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనుమానిత వ్యక్తులు కన్పిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన తెలిపారు. రికార్డులు లేని మోటరు సైకిళ్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ గోపీ, సిబ్బంది ఉన్నారు.

సూళ్లూరుపేట: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయడానికి ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా పోలీసులు గురువారం సూళ్లూరుపేటలో కార్డన్‌సెర్చి నిర్వహించారు. సీఐ మధుబాబు ఆధ్వర్యంలో సూళ్లూరుపేట, తడ, శ్రీహరికోట ఎస్ఐలు రహీం రెడ్డి, నరసింహులు, రఘునాథ్ సహా సిబ్బంది పట్టణంలోని వట్రపాలెంలో విస్తృత తనిఖీలు చేశారు. కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ఎటువంటి ధ్రువపత్రాలు లేని 16 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

పెళ్లకూరు: ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని చిల్లకూరు వడ్డిపాళెంలో పోలీసులు గురువారం కార్డన్‌సెర్చి నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడుపేట సీఐ జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి బయటవ్యక్తుల వివరాలతో పాటు సరైన పత్రాలు లేని వాహనాల స్వాధీనం చేసుకున్నారు. కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

జోరుగా తాటి ముంజల విక్రయాలు



కాయలనుంచి ముంజలను వేరుచేస్తున్న వ్యాపారి

తడ, మే 23: అతి చవకైన పోషకాహారాన్ని ఇచ్చే వాటిలో తాటి ముంజలు ఒకటి... ఈ తరం వారికి వీటిపై పెద్దగా అవగాహన లేదు. పొలాల గట్లపైన.. రోడ్ల పక్కన తాటి చెట్లను చూస్తూనే ఉంటాం. ఎంత ఎండకైనా, గాలీవానకైనా తట్టుకొని నిలబడే చెట్టు తాటిచెట్టు. తాటి మానుల నుంచి తాటి ఆకులు, తాటి ముంజలు, తాటిపండ్లు, తాటి కల్లు ఇలా అన్ని ఉపయోగపడేవి. అయితే వేసవిలో 2, 3 నెలలు మాత్రమే తాటిముంజలు, పండ్లు అందుబాటులో ఉంటాయి. వడదెబ్బ తగలకుండా, శరీరంలో శక్తిని తగ్గించకుండా ఇవి ఉపయోగపడుతాయి. ఈ తాటి ముంజలో నీరు, కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, పీచుపదార్థం, కాల్షియం, ఇనుపధాతువులు, ఆమ్లం వంటి పోషకాలు ఉంటాయి. వేసవి తాపం తీరడంతోపాటు శరీరానికి అవసరమైన క్యాలరీలు ఈ ముంజలు ద్వారా లభిస్తాయి. జెల్లీలా ఉండే ఈ ముంజలు ఎంతో రుచికరంగా ఉంటాయి. ఇంత ఉపయోగకరంగా ఉండే ఈ ముంజలు కోసం జనం ఎదురు చూస్తుంటారు. ప్రస్తుతం ఈ తాటిపండ్లు, ముంజలు సీజన్ మొదలైంది. ఒక తాటిపండులో మూడు మంజులు ఉంటే దానిని 10 రూపాయలకు విక్రయిస్తున్నారు. తద్వారా కొందరికి ఇది జీవనాధారంగా మారింది. పల్లెటూర్లలో వీటిని సేకరించుకొని పట్టణాలు, మండల కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. వీటి కోసం జనం సైతం ఎగబడుతున్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి రూ.25వేల వితరణ



నాయుడుపేట టౌన్, మే 23: నాయుడుపేట హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి 25వేల రూపాయలను కోటూరు సాయిరాం, తులసి దంపతులు అందజేశారు. బ్రాహ్మణవీధిలోని షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం కమిటీ సభ్యులకు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, మునిరాజ, కృష్ణారావు తదితరులు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ కొని మోటారు సైక్లిస్టు మృతి

నాయుడుపేట టౌన్, మే 23: మండలంలోని పండ్లూరు జాతీయ రహదారి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొని మోటరు సైక్లిస్టు రంగయ్య (40) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... నాయుడుపేట మండలంలోని వేముగుంటపాళేనికి చెందిన రంగయ్య గూడూరు నుంచి బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యంలో పండ్లూరు సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

అన్నదానం

గూడూరు అర్బన్, మే 23: స్థానిక గమళ్లపాళెంలోని నిరాశ్రయుల కేంద్రంలో గురువారం శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పుట్టినరోజు వేడుకలు

గూడూరు అర్బన్, మే 23: స్థానిక సనత్‌నగర్‌లో గురువారం ఎమ్మెల్సీ, వైసీపీ అభ్యర్థి మేరిగ మురళీధర్ పుట్టినరోజు సందర్భంగా వైసీపీ నాయకులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో బి.శ్రీనివాసులు, నారాయణరెడ్డి, పెంచలరెడ్డి, శుభాన్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భాస్కర్ రెడ్డి అంత్యక్రియలు



భాస్కర రెడ్డికి నివాళి అర్పిస్తున్న ఆనం

డక్కిలి, మే 23: సీనియర్ రాయకీయ నాయకుడు చెలికం భాస్కరరెడ్డి హఠాన్మరణంతో డక్కిలి మండల టీడీపీ మంచి నేతను కోల్పోయిందని మాజీ మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. గురువారం డక్కిలిలో భాస్కరరెడ్డి అంత్యక్రియలకు వారు హాజరై నివాళి అర్పించారు. భాస్కరెడ్డి మరణం తమని దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. మాజీ ఎమ్మెల్యే కురుమార్తె కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియ, తానంకి నానాజీ, గంగోటి నాగేశ్వరరావు, జన్ని రమణయ్య, పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, ఏ.రామచంద్రయ్య నాయుడు, గంగాధరం, అవ్వారు సత్యనారాయణ, పి.చంద్రమౌళి రెడ్డి, వి.మధునాయుడు తదితరులున్నారు.

వెంకటగిరి టౌన్: డక్కిలి మండల సీనియర్ నాయకుడు,పెంచలకోన ట్రస్ట్ బోర్డు కమిటీ మాజీ సభ్యుడు చెలికం భాస్కర్ రెడ్డి మృతికి మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి విచారం వ్యక్తం చేశారు. చెలికం మృతి తన కుటుంబానికి రాజకీయంగా తీరని లోటు అన్నారు.

పచ్చిరొట్టతో అధిక దిగుబడులు

వెంకటగిరిటౌన్, మే23: జీలగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు యాభై శాతం రాయితీతో సరఫరా చేస్తున్నామని వ్యవసాయ సహాయ సంచాలకుడు నాగార్జున సాగర్ తెలిపారు. తగినంత నీరు అందుబాటులో లేకపోవడం వలన వరి సాగు చేసే పరిస్థితి లేదన్నారు. భూములను బీడుగా ఉంచకుండా పిచ్చరొట్ట విత్తి వరి నాటే సమయంలో దుక్కి దున్నడం ద్వారా అధిక దిగుబడి వస్తుందన్నారు. అంతే కాకుండా భూమిలో సేంద్రియ పదార్థం పెరిగి భూసారం పెరుగుతుందన్నారు.

మలుపుల్లో స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయరూ...!





పాత బస్టాండు వద్ద మలుపు - ప్రమాదకరంగా ఉన్న సంఘం థియేటర్ సెంటర్‌లోని కూడలి

గూడూరు, మే 23: పట్టణంలోని పలు ప్రాంతాల్లోని కూడళ్లలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధాన మార్గంలో వాహనాల రద్దీ పెరగడంతో కూడళ్ల వద్ద వేగంగా వచ్చే వాహనాల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయంటున్నారు. పట్టణంలో ఆర్టీసీ బస్టాండు నుంచి శాంతినగర్ అండర్‌బ్రిడ్జి వరకు గల ప్రధానరహదారి మార్గంలో పలు కూడళ్లు, మలుపులున్నాయి. పట్టణంలో వాహనాల సంఖ్య పెరిగింది. దీంతోపాటు వివిధ పనులపై సమీప గ్రామాల నుంచి ప్రజలు వాహనాల్లో పట్టణానికి వస్తుంటారు. కూడళ్ల వద్ద, మలుపుల వద్ద వేగ నిరోధకాలను ఏర్పాటు చేయకపోవడంతో వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాలకు లోనవుతున్నారు. సంఘం థియేటర్ సెంటర్‌లో, కుమ్మరవీధి సెంటర్‌లో నాలుగు రోడ్లు కలిసే చోట, ఏరియా ఆసుపత్రి సమీపంలో, పాతబస్టాండుకు వెళ్లే మార్గంలో, రైల్వేస్టేషన్ మీదుగా వివేకానందరోడ్డులోకి వెళ్లే మార్గంలోని మలుపు వద్ద, శాంతినగర్ అండర్‌బ్రిడ్జి సమీపంలోని మలుపు వద్ద వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతాల్లో వేగనిరోధకాలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో వేగంగా వచ్చే వాహనాలను తప్పించుకుని రోడ్డు దాటాలంటే ఇబ్బందికరంగా మారిందని పాదచారులు చెబుతున్నారు. రోడ్డు దాటే సమయంలో వాహనాలు ఢీకొని పాదాచారులు గాయపడిన సంఘటనలున్నాయి.ఆయా ప్రాంతాల్లో అధికారులు స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.

నలభై ఏళ్ల విద్యుత్ సమస్యకు మోక్షం

చెందోడు సబ్ డివిజన్ ఏడీ చొరవ ● సరఫరా అంతరాయానికి పరిష్కారం

చిట్టమూరు, మే 23: చెందోడు (కోట) సబ్‌డివిజన్ పరిధిలో నలభై ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని విద్యుత్ సరఫరా అంతరాయానికి చెందోడు సబ్‌డివిజన్ ఏడీ చొరవతో పరిష్కారమైంది. పకృతి వైపరీత్యాల కారణంగా చిన్నపాటి గాలి వీచినా విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. అంతేకాక పాత విద్యుత్ తీగలకు ఏర్పాటు చేసిన జంపర్లు తెగిపోవడం, ఇన్సులేటర్లు పగిలిపోయేవి. దీంతో విద్యుత్ శాఖ సిబ్బంది వర్షాకాలంలో పడే కష్టాలు వర్ణనాతీతం. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని స్పందించిన ఏడీ వరప్రసాద్‌రెడ్డి చిట్టమూరు మండల ట్రాన్స్‌కో సిబ్బంది, షిఫ్ట్ ఆపరేటర్లు, బిల్లింగ్ సిబ్బంది సుమారు వంద మందితో మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. చిట్టమూరు మండలంలోని కొత్తగుంట, మల్లాం, యల్లసిరి, గొట్టిప్రోలు, ఏకసిరి సబ్‌స్టేషన్‌ల వద్ద ఫీడర్లకు మరమ్మతులు చేపట్టారు. అదేవిధంగా లైన్ మీద దెబ్బతిన్న జంపర్లు, ఇన్సులేటర్లు మార్చుకుంటూ వస్తున్నారు. పలు చోట్ల వదులుగా ఉన్న విద్యుత్ తీగలను లాగి కట్టారు. కోగిలి, మల్లాం, ఆరూరు, ఏకసిరి, గునపాడు, పెళ్లకూరు, బురదగాలి కొత్తపాళెం గ్రామాల్లో పనులు పూర్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న విద్యుత్ లైన్లు మరమ్మతులు చేపట్టామని, ప్రధాన కూడళ్లలో రోడ్డుకు అడ్డంగా వాహనాలకు తగులుతున్న లైన్లు ఎత్తు పెంచుతామని ఏడీ తెలిపారు. విద్యుత్ నిర్వహణ పనుల్లో ఇన్‌చార్జి ఏఈ పోలయ్య, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్, సిబ్బంది పాల్గొన్నారు.



కోగిలి సమీపంలో విద్యుత్ లైన్లు సరి చేస్తున్న సిబ్బంది

దడ పుట్టిస్తున్న వీధికుక్కలు



గూడూరు, మే 23: పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు స్థానికులకు దడ పుట్టిస్తున్నాయి. వీధికుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వాటి సంచారం పెరిగిపోయింది. దీంతో రాత్రి, వేకువ సమయాలలో వీధుల్లో తిరగాలంటే స్థానికులు హడలిపోతున్నారు. వేసవి సెలవులు కావడంతో చిన్నారులు వీధులలో ఆటలు ఆడుకునే సమయంలో, ట్యూషన్ల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో కుక్కలు తరుము కుంటుండడంతో భయాందోళన చెందుతున్నారు. వాకింగ్ వెళ్లే వారు కూడా ఇబ్బంది పడుతున్నారు. వాహనాల్లో వెళ్ళే సమయంలో తరుముకుంటూ పైకి వస్తుండడంతో ప్రమాదాలకు లోనవుతున్నామని వాహనచోదకులు చెబుతున్నారు. బ్యాగులతో రైల్వేస్టేషన్, బస్టాండులకు వెళ్లాలన్నా కుక్కలు వెంటబడుతున్నాయని చెబుతున్నారు. ప్రధానంగా పాతబస్టాండు, టవర్‌క్లాక్ సెంటర్, ఐసీఎస్ రోడ్డు, మసీదువీధి, అశోక్‌నగర్, మాళవ్యానగర్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల మసీదువీధికి చెందిన ఆరేళ్ల చిన్నారి రాత్రి సమయంలో శివాలయం వీధిలో ఆటలాడుకుని ఇంటికి వెళుతుండగా ఓ వీధికుక్క దాడి చేయడంతో గాయాలపాలైంది. స్టేడియంలో వాకింగ్ చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి వెనుకకకు నడుస్తుండంగా ఓ కుక్క కరిచింది. గతంలో మున్సిపల్ అధికారులు వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోనేవారన్నారు. గతంలో తిరుపతికి చెందిన ఓ ప్రైవేటు సంస్థ సహకారంతో వీధి కుక్కలను పట్టుకుని వాటికి సంతానోత్పత్తి నిలిచిపోయేలా ఇంజెక్షన్లు వేసి తిరిగి వదిలివేసేవారు. దీంతో వీధికుక్కల పెరుగుదల కొంతమేర తగ్గేది. మూడేళ్లకుపైగా వీధికుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టలేదని అంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చిన్నారులపై వీధికుక్క దాడి

తడ, మే 23 : ఏడాదిన్నర చిన్నారిపై వీధికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. తడ కండ్రిగ పంచాయతీ సుబ్రహ్మణ్యం, నివి దంపతుల కుమారుడు నందా గురువారం సాయంత్రం ఇంటి ముందర ఆడుకుంటుండగా అటుగా వెళ్తున్న వీధికుక్క దాడి చేసింది. దీంతో చిన్నారికి తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే తల్లిదండ్రులు బాలుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అలాగే అక్కడ కొద్ది దూరంలో నడిచి వెళ్తున్న ఐదేళ్ల బాలుడిపై సైతం ఆ కుక్క దాడి చేసింది.





శిథిలావస్థకు చేరుకున్న ఉన్న కర్లపూడి వంతెన , కూలిన సైడ్ వాల్

దుస్థితిలో వంతెనలు... పట్టించుకోని అధికారులు

కోట, మే 23: నాలుగు దశాబ్దాల క్రితం స్వర్ణముఖి నది, చల్లకాలువపై నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అక్కడక్కడా వంతెనలకు పగుళ్లు ఇచ్చి కూలిపోయే స్థితిలో ఉన్నాయి. దీంతో ఆయా వంతెనలపై ప్రయాణించాలంటేనే అటు వాహనచోదకులు, ఇటు పాదచారులు హడలిపోతున్నారు. కోట మండలంలోని 10 తీరప్రాంత గ్రామాల మీదుగా చల్లకాలువ నది గోవిందపల్లిపాళెం వద్ద ఉన్న బంగాళాఖాతంలో కలుస్తుంది. ఈ నదికి నెల్లూరుపల్లి కొత్తపాళెం, కర్లపూడి, సిద్ధవరం మధ్య హైలెవల్ వంతెనలు నిర్మించారు. అవి నిర్మించి నాలుగు దశాబ్దాల పైమాటే. ఆయా వంతెనలపై నిత్యం సిలికా, ఇసుక, గ్రావెల్ లారీలతోపాటు పలు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అంతేకాకుండా బస్సులు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలతో రద్దీగా ఉంటాయి. అయితే కర్లపూడి వద్ద చల్లకాలువపై నిర్మించిన హై లెవల్ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ వంతెనకు మధ్య భాగంలో పగుళ్లు ఇచ్చి పెచ్చులూడుతున్నాయి. వంతెన ప్రహరీలు పడిపోయే స్థితిలో ఉన్నాయి. అంతేకాకుండా ఈవంతెనమీదుగా నెల్లూరు, ముత్తుకూరులతోపాటు చిల్లకూరు మండలంలోని పలు తీరప్రాంత గ్రామాలకు వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ఎక్కడ ఈ వంతెన కూలిపోతుందోనని ఆయా గ్రామాల ప్రజలు భయంగుప్పెట్లో ఉన్నారు. ఆర్అండ్‌బీ అధికారులు పగుళ్లు ఇచ్చినచోట తాత్కలిక మరమ్మతులు కూడా చేయకపోవడం గమనార్హం. అదే విధంగా సిద్ధవరం వద్ద నిర్మించిన హైలెవల్ వంతెన పగుళ్లు ఇచ్చింది. సిద్ధవరంతోపాటు గోవిందపల్లి, గోవిందపల్లిపాళెం, కొత్తపట్నం, శ్రీనివాససత్రం, వావిళ్లదొరువు, గున్నంపడియ, యమదిన్నెపాళెం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అదే విధంగా గూడలి వద్ద స్వర్ణముఖినదిపై నిర్మించిన లో లెవల్ వంతెన కూడా శిథిలావస్థకు చేరుకుంది. ఈ వంతెనమీద బస్సులు, వాహనాలు నాయుడుపేట, చెన్నై, తిరుపతి వరకు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ వంతెనకు కూడా తాత్కలిక మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వర్ణముఖి, చల్లకాలువపై నిర్మించిన వంతెనలకు సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.





కూలిపోయే స్థితిలో ఉన్న సిద్ధవరం వంతెన - వంతెన మధ్యలో పగుళ్లు వచ్చి ఉన్న దృశ్యం



కోన చుట్టూ జనమే జనం

పెనుశిల లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు సందర్భంగా కోన జనసంద్రంగా మారింది. పెద్ద సంఖ్యలో భక్తులు కోనకు తరలివచ్చి శ్రీవారిని దర్శించుకుంటున్నారు. చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి సమేత పెంచల స్వామి కల్యాణాన్ని తిలకించి పరవశించిపోయారు. కల్యాణం సందర్భంగా స్వామిఅమ్మవార్లకు ఆలయ అధికారులు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో సంచార దుకాణాదారుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగింది. కొనుగోలు దారులతో దుకాణాలన్నీ కిటకిటలాడాయి.

- డక్కిలి

మోహినీ అలంకారంలో చెన్నకేశవస్వామి



గూడూరు, మే 23: పట్టణంలోని కర్ణాలవీధిలో కొలువై ఉన్న భూదేవి, శ్రీదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో గురువారం స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. చెన్నకేశవస్వామిని మోహినీగా అలంకరించి తిరువీధి ఉత్సవం జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేత్రపర్వంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



తాళిబొట్టును చూపుతున్న వేదపండితులు

చిల్లకూరు, మే 23: మండలంలోని కలవకొండపై కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి,అమ్మవార్ల కల్యాణం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కన్నులపండువగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి గజవాహనంపై అధిష్ఠింపజేసి విశేషపూజలు జరిపారు. అన్నదానం జరిగింది. భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను ఆలయం సమీపంలో ఊరేగించారు.

ద్వారదర్శనం అపూర్వం

గరుడవాహన సేవ నేత్రపర్వం



నాయుడుపేట, మే 23 : నాయుడుపేట తుమ్మూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కరిమాణిక్యస్వామి దేవస్థానంలో తిరుమల, తిరుపతి దేవస్థానాల వేదపండితుల మంత్రోచ్చరణలనడుమ, మంగళవాయిద్యాలతో అత్యంత వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగం గురువారం దేవస్థానంలో ద్వారదర్శనానికి భక్తులు విరివిగా దర్శనం చేసుకున్నారు. రాత్రి గరుడవాహనంపై కరిమాణిక్య స్వామి నగరోత్సవంలో భక్తులు పాల్గొన్నారు. ఉభయకర్తలుగా పోచారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రమాదేవి దంపతులు వ్యవహరించారు.

అభయశంకరుడిఆలయంలో పౌర్ణమి వేడుకలు



సూళ్లూరుపేట, మే 23: పట్టణంలోని టీడీపీ కార్యాలయ సమీపంలో ఉన్న అభయ శంకరుడి ఆలయంలో గురువారం పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, మేడా సాయి, గండవరం రమేష్ రెడ్డి, నాపా మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చండీయాగం



చండీయాగం అనంతరం పూర్ణాహుతిని తీసుకెళ్తున్న ఉభయకర్తలు

సూళ్లూరుపేట, మే 23: తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో గురువారం మహా చండీయాగాన్ని శాస్త్రోకతంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి వేదపండితుల, మంత్రోచ్చాటన నడుమ యాగాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా తడ మండల బీవీపాలెం మాజీ సర్పంచ్ గోవిందరాజులు దంపతులు వ్యవహరించారు. యాగం అనంతరం ఉభయకర్తలను వేదపండితులు ఆశీర్వదించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

బౌద్ధమతంపై నమ్మకం పెరుగుతోంది



బుద్ధుడు, అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న ప్రతినిధులు

కోట, మే 23: ప్రస్తుత తరంలో బౌద్ధ మతంపై నమ్మకం పెరుగుతోందని పలువురు బౌద్ధ మతస్తులు, అంబేడ్కరిస్టులు అన్నారు. కోటలోని మహాత్మాజ్యోతిబా ఫూలే నగర్‌లో గురువారం బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుద్ధజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా ప్రతినిధులు, మత మార్పిడి చేసుకున్నవారు బుద్ధ, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళి అర్పించారు. ఆనాడు బుద్ధుడు బౌద్ధ మతాన్ని ప్రారంభించాడని, అది మహావృక్షంలా పెరుగుతూ ప్రపంచం నలుమూలల వేగంగా వ్యాప్తి చెందిందన్నారు. అందరూ కలసి కట్టుగా ఉండి బుద్ధుడి ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్దామన్నారు ఐక్యవేదిక ప్రతినిధులు దాసరి సుందరం, మీజూరు మాధవ్, డాక్టర్ రవికుమార్, బలరామయ్య, రంగయ్య, అశోక్‌కాంబ్లే తదితరులు ఉన్నారు.